ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 20 మే 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 27.0



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్.. చిత్రంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ప్రాధాన్యతలను గుర్తించండి

- అభివృద్ధి వైపు ముందడుగు వేయండి..
- ఎమ్మెల్యేలు ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించండి
- సాగు దగ్గర్నుంచి విద్య వరకు ముఖ్యమే
- అందరి సహకారంతో మరింత అభివృద్ధి
- జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వేసవి పూర్తై వర్షాకాలం సమీస్తుండగా ఆ మేరకు అన్ని విభాగాల్లోను అప్రమత్తత నెలకొనాలని, త్వరిత గతిన నిర్ణయాలను తీసుకోవాలని, వ్యవసాయ సంబంధ అంశాలే కాకుండా, విద్యా, వైద్య తదితర అంశాలపై ప్రాధాన్యత కల్పించాలని ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కాలువల్లో పూడిక తీత, ఉపాధి హామీ, తాగునీటి సరఫరా, రెవెన్యూ, విద్యా, ఉద్యానవన విభాగాలపై మంత్రి ప్రత్యేకించి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. సాగునీటి వనరులకు సంబంధించి పనులన్నీ పూర్తి చేయాలి. ఎక్కడ నీటి ప్రవాహానికి ఇబ్బందులేర్పడం, రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపైనే ఉంది. రుతు పవనాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కాలువలు, చెరువుల్లో తూడు, పూడికతీత పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలి. మైనర్ ఇరిగేషన్ పనులు తక్షణం పూర్తి చేయాలి. ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో 50 రోజుల్లోనే 31.71 లక్షల పనిదినాలు కల్పించాం. వచ్చే నెల 15లోపు 65 శాతం పూర్తి చేయాల్సిందే. ఆయిల్‌పామ్ విస్తరణకు ఎన్నో అవకాశాలున్నాయి. రైతుల్లో మరింత చైతన్యం పెంచాలి. ప్రభుత్వ స్కూల్స్‌లో ఈ విద్యాసంవత్సరంలోనే 13 వేల మంది విద్యార్థుల ప్రవేశం అదనంగా పెరగాలి. డ్రాపవుట్‌లను సహించం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలి. పోలవరంలో గర్భిణి మృతి చెందడం వంటి ఘటనలు పునరావృతం కాకూడదు. అభివృద్ధి పనులు ప్రతిపాదనలు రూపొందించే సమయంలో స్థానిక ఎమ్మెల్యేల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలి' అని ఆయన అధికారులకు హితబోధ చేశారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర నాథ్, ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మ రాజు, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు, ఆర్డీవోలు అచ్యుత అంబరీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో టాప్ : మంత్రి నాదెండ్ల

ఖరీఫ్, రబీ కాలంలో 12వేల400 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గతంలో కన్నా 8.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేశామని, రైతులకు 24 గంటల్లో సొమ్ము చేశామన్నారు. జిల్లా సమీక్షా సమావేశం తర్వాత మంత్రి పార్థసారథితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏలూరు జిల్లాలో రబీకి సంబంధించి ఇప్పటికే 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి అయ్యిందన్నారు. ఇప్పటికే రూ.486 కోట్లు రైతు ఖాతాల్లోకి వేశామన్నారు. ఏలూరు జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుతామని, ప్రజలతో కలిసి అడుగులు వేస్తామన్నారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు అగ్రతాంబూలం ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో పేరుకుపోయిన సమస్యలను 30 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

భూసేకరణ పూర్తి చేయాలి: మంత్రి పార్థసారథి

నూజివీడు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులకు భూసేకరణ పూర్తి చేయాలి. ఆగిరిపల్లి పర్యటనలో సీఎం ఇచ్చిన హామీ మేరకు పశువుల షెడ్డును ఏర్పాటు చేయా లి. కామవరపుకోట వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు జరగాల్సిందే. ఇళ్ల నిర్మాణాల్లో పట్టణ ప్రాంతాల్లో అర్హులను గుర్తించి, దరఖాస్తు చేసేలా చూడాలి. మామిడిపై కోడిపేను వైరస్‌తో నష్టపోతున్నారు. రానున్న సీజన్‌కు అయినా దీనిని అరికట్టాలి.

పూడిక తీయండి : చింతమనేని ప్రభాకర్

దెందులూరు గోదావరి కాలువకు శివారు ప్రాంతాలైన నియోజకవర్గ పరిధిలో కాలువలు, చెరువుల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత పనులు చేపట్టి పూర్తి చేయాలి. కాలువలు, చెరువులకు మరమ్మతులు చేయాలి.

ఉప్పుటేరు నుంచి రక్షణ కల్పించండి : కామినేని

కైకలూరు నియోజకవర్గంలో ఉప్పుటేరు ముంపునుంచి రైతులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వాస్తవ పరిస్థితిని గుర్తించి తదనుగుణంగానే తీసుకునే చర్యలుండాలి.

మెరుగైన వైద్యం అందాలి : బడేటి చంటి

ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాల్సిందే. ఈ ఆసుపత్రికి సౌకర్యాల కల్పనతో పాటు, ప్రజలు మెచ్చే వైద్య సేవలు అమలు కావాలి. ఈ దిశగానే చర్యలు తీసుకోండి.

సహకరించండి : మద్దిపాటి వెంకట్రాజు

పశువుల షెడ్ల నిర్మాణంలో రైతులిచ్చే సూచనల వైపు చూడండి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా చూడండి. పామాయిల్ కోత సమయంలో విద్యుదాఘాతంతో మరణించే వారి సంఖ్య పెరుగుతోంది. దీనికి అడ్డుకట్ట వేయాలి.

ఉద్యాన పంటలే లక్ష్యం : కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లాలో ఉద్యానవన పంటల్లో 80 శాతం పామాయిల్, 10 శాతం కోకో, ఇంకో 10 శాతం ఇతర ఉద్యానపంటలు సాగవుతున్నాయి. జిల్లాలో ఈ పంటలను మరింత విస్తరించేలా లక్ష్యంగా పెట్టుకున్నాం.



పాల్గొన్న అధికారులు



చావంటే.. సహజమే !

2022 మార్చిలో జంగారెడ్డిగూడెం కల్తీ నాటు సారా చావులపై
నాడు జగన్ సర్కార్ ధోరణి

- కేసులు పెట్టినా దిక్కూ మొక్కూ లేదు
- ఇప్పుడు నిగ్గు తేల్చేందుకు బాబు సర్కార్ నిర్ణయం
- నెల రోజుల్లో నివేదికిచ్చేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- పాత పోకడలన్నీ తవ్వి తీసేందుకు రంగం సిద్ధం
- ప్రభుత్వ నిర్ణయంపై బాధిత కుటుంబాల హర్షం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జంగారెడ్డిగూడెంలో పదుల సంఖ్యలో మృత్యువాత పడితే, అప్పట్లో జగన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరించింది. వరుసగా కల్తీ నాటు సారా తాగి చనిపోతున్నారని గొల్లుమంటే.. అబ్బేబ్బే ఈ చావులన్నీ సాధారణమే అన్నారు. అసలు సారా తయారీ కావడం లేదని బొంకారు. అక్కడక్కడ ఆగ్రహంతో ఊగిపోతున్న వారిని అప్పటికప్పుడు మేనేజ్ చేశారు. కల్తీ సారా కారణంగానే పదుల సంఖ్యలో జనం చనిపోయారని మిగతా పక్షాలు పేర్కొంటే.. శవ రాజకీయమంటూ కొట్టిపారేశారు. స్టేషన్ల వరకు వెళ్లి కేసుల పెడతామని ప్రయత్నిస్తే కాదు పొమ్మన్నారు. ఇదంతా 2022 మార్చి నెలలో జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. అప్పట్లో కొవిడ్ తగ్గి, తగ్గక మునుపే పట్టణంలో పిట్టల్లా రాలిపోతే, కనీసం అప్పటి సర్కార్ విచారించనూ లేదు. నివేదికలు కోరలేదు. సారా లేనేలేదంటూ ప్రగల్భాలు పలికింది. కేవలం తమ వారు ఎందుకు చనిపోతున్నారో తేల్చాలని ఎవరైనా డిమాండ్ చేసినా కాదు పొమ్మన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వానికి ఆనాటి స్థితిగతులపై కొందరు ఫిర్యాదుచేశారు. అప్పట్లో తాము ఫిర్యాదు చేసిన విచారించలేదనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతస్థాయిలో ఇప్పుడు కదలిక వచ్చింది. అప్పట్లో జరిగిన మరణాలపై ఇప్పుడు నిగ్గు తేల్చేందుకు సిద్ధం అయ్యారు. నెల రోజుల్లోపే తగిన నివేదికను రాబట్టబోతున్నారు.

మృతుల కుటుంబాలకు అండగా..

ఆనాడు కుటుంబ పెద్ద కుప్పకూలినా కనీసం అంత్యక్రియలకు ఎవరూ ముందుకు రాలేకపోయారు. ఆనాడు ఉన్న జగన్ ప్రభుత్వంలో పెద్దలకు భయపడే ఎవరూ నోరెత్తలేకపోయారు. కనీసం ఇదేమి అన్యాయమని ప్రశ్నించేందుకు సాహసించలేకపోయారు. ఇదే తరుణంలో ఘటన జరిగిన కొద్ది రోజులలోనే అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబు నేనున్నానంటూ జంగారెడ్డిగూడెంలో బాధిత కుటుంబాల వద్దకు వచ్చారు. బహిరంగంగానే సారా తాగి చనిపోయిందీ 26 మంది అని స్థానికులే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రజల కళ్లుగప్పి ఏమీ తెలియదన్నట్టుగా వ్యవహరిస్తోందని దుయ్యబడుతూనే మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. పేద వర్గాలతో జగన్ సర్కార్ ఆటలాడుకుంటున్న తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వానికి అందిన ఫిర్యాదు మేరకు మరోమారు టీడీపీ ప్రభుత్వం కార్యరంగంలోకి దిగింది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. 2022 మార్చిలో చనిపోయిన వారంతా ఏయే కారణాలతో మృతి చెందారో నిగ్గు తేల్చేందుకు ఉత్తర్వులిచ్చారు. దీంతో మృతుల కుటుంబాల్లోను కొంతమేర సంతృప్తి వ్యక్తమవుతోంది. ఘటన జరిగి మూడేళ్లు కావొస్తున్నా తమకు అందిన ఫిర్యాదు మేరకే ప్రభుత్వం స్పందించడం మరో విశేషం. ప్రభుత్వం నిర్ణయాన్ని బాధిత కుటుంబాలు స్వాగతించాయి.



2022 మార్చి 14న జంగారెడ్డిగూడెంలో బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు (ఫైల్)



మృతిచెందిన యువకులు

ప్రాణం తీసిన ఈత సరదా

గెడ్డలో మునిగి ఇద్దరు నూజివీడు యువకుల మృతి

పార్వతీపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పులిగుమ్మిలో సోమవారం సాయంత్రం విషాదం చోటు చేసుకుంది. వివాహ శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు గెడ్డలోకి స్నానానికి దిగి ఈతరాక మునిగిపోయారు. వీరిది ఏలూరు జిల్లా నూజివీడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పులిగుమ్మికి చెందిన మడక గుంపుస్వామి కుమారుడు శేఖరానికి నూజివీడుకు చెందిన యువతితో బుధవారం వివాహం జరుగనుంది. పెళ్లి కుమార్తె తమ్ముడు, అతని స్నేహితులు నలుగురు పెళ్లి ఏర్పాట్లు చేసేందుకు సోమవారమే గ్రామానికి వచ్చారు. వారంతా కలిసి సాయంత్రం పులిగుమ్మి సమీపంలో ఉన్న గెడ్డలోకి స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా కొద్దిసేపటికి బొత్స ఈశ్వర్‌కుమార్ (16), నగిరెడ్డి రాము (16) ఊబిలో చిక్కుకుని మునిగిపోయారు. ఇది చూసిన మిగతా వారు వెంటనే సమీప గ్రామస్థులను పిలిచారు. వారొచ్చి కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

ఏపీ ఈఏపీ సెట్ ప్రారంభం

తొలిరోజు అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలకు 53 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈఏపీ సెట్ - మిగతా 8వ పేజీలో

కొయ్యలగూడెంలో..



తాడేపల్లిగూడెంలో..



మినీ మహానాడు సందడి

టీడీపీ శ్రేణుల ఆనందోత్సాహాల నడుమ ఉమ్మడి పశ్చిమ జిల్లాలో మినీ మహానాడు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పోలవరం నియోజవర్గ మినీ మహానాడు కొయ్యలగూడెంలో జరగ్గా ఉంగుటూరు నియోజకవర్గ మినీ మహానాడు గణపవరంలో, తాడేపల్లిగూడెం నియోజకవర్గ మినీ మహానాడు తాడేపల్లిగూడెంలో జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ తదితరులు హాజరయ్యారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 248 అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ వి జయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన న్యాయం చేయాలి : ఎస్పీ



ఏలూరు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీసు అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన న్యాయం అందించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 45 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలో మొదటిసారిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వీడియో ద్వారా ఫిర్యాదును రికార్డింగ్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై క్షుణ్ణంగా పరిశీలన చేసి త్వరితగతిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి ఎస్పీ సమస్యలను తెలుసుకున్నారు.

'బేబీ'కి.. 'బాబు' గిఫ్ట్!



- ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకం పునరుద్ధరణ
- జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల్లో నెలకు 1200 ప్రసవాలు

ఏలూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించిన శిశువుల సంరక్షణకు ఉద్దేశించిన ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం వెలువడింది. మొత్తం 11 రకాల సామగ్రితో కూడిన బేబీ కిట్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. తొలుత 2016లో ప్రారంభమైన ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకానికి విశేష ఆదరణ లభించింది. అయితే తదుపరి విధ్వంసకర పాలన, అస్తవ్యస్త నిర్ణయాలతో సమాజంలో శిశువులను సైతం వదలకుండా అందరినీ కుదిపేసిన జగన్ ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని నిలిపివేసింది. మళ్లీ ఇపుడు బేబీ కిట్ల పథకాన్ని ప్రారంభించాలని టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో వందల సంఖ్యలో గర్భిణులకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఒక్కో బేబీ కిట్‌లో దోమతెర, దుప్పటి, స్లీపింగ్ బెడ్, యాంటీసెప్టిక్ లోషన్, నాప్‌కిన్, డైపర్లు, షాంపూ, తదితర 11 రకాల వస్తు సామగ్రి ఉంటుంది. ఒక్కో కిట్‌కు అయ్యే ఖర్చు రూ.1410లను ప్రభుత్వమే భరించి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో తల్లులకు ఉచితంగా అందజేస్తుంది. జిల్లాలో ఏలూరులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడులలో ఏరియా ఆసుపత్రులు, బుట్టాయిగూడెం, పోలవరం, దెందులూరు, భీమడోలు, కైకలూరులలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీలు), అన్ని మండలాలు, ప్రధానగ్రామాల్లో మొత్తం 58 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) డెలివరీలు జరుగుతున్నాయి. వీటిన్నంటిలో నెలకు సగటున 1200 డెలివరీలు జరుగుతుండగా, నార్మల్ డెలివరీలు పీహెచ్‌సీల్లో, ప్రత్యేక పరిస్థితుల్లో గర్భిణి ఆరోగ్యస్థితిని బట్టి సిజేరియన్ డెలివరీలతో పాటు, నార్మల్ డెలివరీలు సీహెచ్‌సీలు, ఏహెచ్‌లు, ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిల్లో జరుగుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నెలకు సుమారు 3 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వా సుపత్రుల్లో జరుగుతున్న మొత్తం డెలివరీల్లో దాదాపు 50 శాతం సి-సెక్షన్లే (సిజేరియన్లే). ప్రభుత్వరంగంలో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోనే అత్యధికంగా డెలివరీలు జరుగుతున్నాయని వైద్యఆరోగ్యశాఖ వర్గాలు వివరించాయి. దీనిపై డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు మాట్లాడుతూ 'జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల వారీగా నెలనెలా జరిగే డెలివరీల సంఖ్య ఆధారంగా బేబీ కిట్ల సరఫరా కోసం ఇండెంట్ పెడతాం. కిట్ల పంపిణీ ఎప్పటి నుంచి ఉంటుందో మా వద్ద సమాచారం లేదు' అని వివరించాయి.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో వాహనదారులు లైసెన్సులు పొందడంలో, రెన్యువల్‌లో ఎదురవుతున్న సమస్యలు, వాహనాలకు సంబంధించి రవాణాశాఖ సేవలు పొందడంలో ఇబ్బందులు, హెల్మెట్ నియమ నిబంధనలపై 21వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు **70136 20539** నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి జిల్లా ఉపరవాణాశాఖాధికారి షేక్ కరీమ్ చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో వీడని వర్షాలు

ఏలూరుసిటీ/కుక్కునూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం పగటి పూట ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించినా సాయంత్రం అయ్యేసరికి వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో మబ్బుల వాతావరణం నెలకొంది. కుక్కునూరు మండలంలో గంటసేపు ఉరుములు, మెరుపులతో పాటు వర్షం కురిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. రాబోయే మూడు రోజుల్లో జిల్లాలో భారీగానే వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కాగా ఆదివారం సాయంత్రం కుక్కునూరులో పిడుగులు పడిన విషయం విదితమే. పిడుగుల కారణంగా గ్రామంలో దాదాపు 40కి పైగా ఇన్వర్టర్లు, ఇళ్లల్లో ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ గృహోపకరణాలు కాలిపోయినట్టు సమాచారం.



జంగారెడ్డిగూడెం డిపోలో వెదురు కర్రలను లారీ నుంచి అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

పచ్చ బంగారమే..!

ప్రభుత్వానికి ఆదాయ వనరు

ఏజెన్సీ ప్రాంతంలో 2,971 హెక్టార్లలో వెదురు సాగు

జంగారెడ్డిగూడెం డిపోలో పెద్ద ఎత్తున నిల్వలు



జంగారెడ్డిగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ప్రభుత్వ కలప, వెదురు డిపో వెదురు కర్రలతో కళకళలాడుతుంది. ప్రభుత్వానికి ఆదాయం తీసుకువచ్చే ప్రధాన అటవీ పంట వెదురు. ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయగూడెం మండలంలో 2,971 హెక్టా ర్లలో ఈ వెదురు తోటలు అందుబాటులో ఉన్నాయి. వెదురు తోటలను దక్షిణాది రాష్ట్రాల్లో విరివిగా పండిస్తారు. అక్కడ ఈ వెదురు పంటను ఆకుపచ్చ బంగారంగా పిలుస్తారు. ప్రతీ సంవత్సరం అక్టోబర్ నుంచి జూన్ నెల వరకూ బుట్టాయగూడెం మండలంలోని గుమ్ములూరు, కల్లుమామిడి, రేగుల పాడు, ముంజులూరు, మోతుగూడెం సెక్షన్ల పరిధిలో ఉన్న వెదురు తోటల్లో నుంచి ఆయా గ్రామాల గిరిజనులతో వెదురు కర్రలు నరికి లారీలపై జంగారెడ్డిగూడెం డిపోకు పంపుతారు. డిపోలో ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో ప్రతీ నెలలో 12, 27వ తేదీల్లో వెదురు కర్రలను వేలం వేస్తారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేస్తారు.

ఇతర ప్రాంతాల నుంచి డిమాండ్

వెదురు కర్రల కోసం ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాల నుంచి మాత్రమే కాక రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి కొనేందుకు వస్తారు. ఈ వెదురు కర్రలను చేపలు, రొయ్యల చెరువులు వద్ద ఉపయోగిస్తారు. పలు తీగ జాతి కూరగాయల సాగు, అరటి తోటల్లో ఉపయో గిస్తారు. వెదురుతో చేసే వస్తువులు, కుర్చీలు, వెదురు బుట్టలు, పాకలు, పందిళ్ల కోసమే కాకుండా వివిధ అవసరాలకు వెదురును ఉపయోగిస్తారు. ఈ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ సాధారణ భూముల్లో వెదురును సాగు చేస్తూ రూ.లక్షల రూపాయలను సంపాదిస్తున్నారు.

తగ్గిన టేకు ప్లాంటేషన్

ఒకప్పుడు జంగా రెడ్డిగూడెం ప్రభుత్వ కలప, వెదురు డిపోలో వెదురుతో పాటు టేకు కలప వేలం కూడా బాగా జరిగేది. కానీ ప్రస్తుతం ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో టేకు ప్లాంటేషన్ బాగా తగ్గిపోయింది. కేవలం పలు కేసుల్లో పట్టుబడిన టేకు మాత్రమే ఇక్కడ డిపోలో వేలం వేస్తున్నారు. తమ ఇళ్ల నిర్మాణాలకు, ఇతర అవసరాలకు టేకు కలప కావలసిన ప్రజలు ప్రైవేటు టింబర్ డిపోలను ఆశ్రయిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో లభించే మారు జాతి కలపను, వంట చెరకు కోసం ఉపయోగించే కలపను కూడా జంగా రెడ్డిగూడెం డిపోలో వేలానికి సిద్ధంగా ఉంచారు.

అక్టోబరు-జూన్ నెలల మధ్య వెదురు కటింగ్

2024-25 సంవత్సరానికి గానూ 5 లక్షల 34 వేల వెదురు కర్రలను నరికించి వేలం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడానికి ప్రభుత్వం టార్గెట్ ఇచ్చింది. ఇప్పటి వరకు 2 లక్షల 10 వేల వెదురు కర్రలు డిపోకు చేరుకున్నాయి. ప్రతీ సంవత్సరం అక్టోబర్ నుంచి జూన్ నెల వరకు మాత్రమే ఈ కర్రలు కట్ చేస్తారు. ఏ గ్రామంలో అయితే వెదురు తోటలు ఉన్నాయో ఆ గ్రామంలోని గిరిజనులతోనే కర్రలను నరికించి లారీల్లో లోడింగ్ చేయించి జంగా రెడ్డిగూడెం డిపో వద్ద అన్ లోడింగ్ చేయిస్తాం. వీరికి ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం వెదురు కటింగ్, రవాణా నిమిత్తం రూ.25 లక్షల వరకు నిధులు విడుదల చేసింది. టేకు తోటల విషయానికి వస్తే కన్నాపురం రేంజ్‌లో 40 హెక్టార్లలో టేకు ప్లాంటేషన్ ఉంది. ఈ పంట చేతికి వచ్చాక ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే మాత్రమే టేకు చెట్లను కట్ చేసి డిపోకు తీసుకువచ్చి వేలం నిర్వహించడానికి అవకాశం ఉంటుందని జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య తెలిపారు.

కొబ్బరి మార్కెట్ కళ..కళ



ఎగుమతి ధరలు రిటైల్ రూ.15వేలు

రైతువారీ కొనుగోళ్లు రూ.12 వేలు

ధరలు మరింత పెరిగే అవకాశం

తమిళనాడు,కేరళల్లో తగ్గిన దిగుబడి

ఆంధ్రా కొబ్బరికి డిమాండ్

పాలకొల్లు, మే 19 (ఆంధ్రజ్యోతి) : కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. పది నెలలుగా మార్కెట్ అనుకూలంగా ఉండటంతో కొబ్బరి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూర్వ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొబ్బరి రైతువారీ కొనుగోళ్లు మెరుగ్గా ఉన్నాయి. పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలో రైతులు వద్ద పచ్చి కొబ్బరి రూ.12 వేలు ఉండగా తూర్పుగోదావరి జిల్లాలో రైతువారీ కొనుగోళ్లు రూ.14 వేలు ఉంది. సమీప రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో కొబ్బరి దిగుబడి తక్కువగా ఉండటంతో ఆంధ్రా ప్రాంత కొబ్బరి ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలలో కొబ్బరి మార్కెట్ మరింత బలపడే విధంగా ఉంది. వచ్చే రెండు నెలల్లో రైతువారీ కొనుగోళ్లు రూ.15 వేలకు చేరవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో కొబ్బరి ఎగుమతి ధరలు ఢిల్లీ క్వాలిటీ వెయ్యి రూ.15 వేలు ఉండగా రెండవ రకం క్వాలిటీ రూ.12 వేలు, 60/65 బత్తీల కాయలు ధర వెయ్యి కాయలకు రూ.13 వేలు ఉంది. బాగా చిన్న కాయలు (70 బత్తీలు) ధర రూ.5 నుంచి 6 వేలు ఉంది.

కాయల్లో తగ్గిన నాణ్యత

కొబ్బరి ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ కాయలలో నాణ్యం తగ్గింది. ప్రతీ వెయ్యి కాయలలో 400 చిన్న కాయలు వస్తున్నాయని వర్తకులు చెబుతున్నారు. రైతుల వద్ద ఖాతాలు పోకుండా ఉండటానికి కొనుగోళ్లు చేస్తున్నామని ఇప్పుడు గిట్టుబాటు ధరలే వస్తున్నాయని వర్తకులు చెబుతున్నారు. ముఖ్యంగా గోదావరి పరివాహ ప్రాంతాలలో కొబ్బరికాయ సైజు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో ఘననీయంగా తగ్గింది. రెండు దశాబ్దాలకు ముందు ఒక గంపలో 25 నుంచి 30 కాయలు పడగా ఇప్పుడు సైజు తగ్గిన కారణంగా ఒక గంపకు 50 నుంచి 60 కాయలు పడుతున్నాయి ఈ పరిస్థితుల్లో టర్నోవర్ కోసమే కొనుగోళ్లు చేస్తున్నామని పలువురు వర్తకులు చెబుతున్నారు.

తగ్గిన సస్యరక్షణ

కొబ్బరి రైతులలో పూర్వపు ఉత్సాహం కనిపించడం లేదు. కార్మికుల కొరత, చెట్లకు సస్యరక్షణ చర్యలు చేయించాలంటే వేలాది రూపాయలు ఖర్చు, ఆ మేరకు ఆదాయం కనిపించకపోవడంతో కొబ్బరి రైతులు వచ్చే ఆదాయం చాలనుకుని సస్యరక్షణ తగ్గించారు. దీంతో కొబ్బరికాయల నాణ్యత తగ్గింది. జిల్లాలోని డెల్టాప్రాంత కొబ్బరి తోటల్లో కొంత మేరకు రైతులు సాగు అభివృద్ధి చేస్తున్నప్పటికీ ప్రధానంగా కాల్వగట్ల వెంబడి, రహదారుల వెంబడి కొబ్బరిచెట్లకు ప్రకృతి పరంగా అందే వర్షపు నీరు మినహా నీటిని పెట్టే అవకాశం లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో కొబ్బరి కాయలు మామిడికాయ సైజుకు తగ్గాయి. సాధారణంగా వేసవి మామిడి సీజన్‌లో కొబ్బరి ధర కొద్దిగా తగ్గుతుంది. రవాణా వాహనాలు మామిడి ఎగుమతులకు వెళ్లే కారణంగా కొబ్బరి మార్కెట్ స్పీడు తగ్గుతుంది. అయితే ప్రస్తుత వేసవిలో దిగుమతులు మెరుగ్గా ఉండటంతో ధరలు బాగున్నాయి.

ధర ఆశాజనకం..

వర్తకులు నిల్వ కాయను అటకకు వేస్తుండటంతో వచ్చే తొలకరికి సైతం ధరలు నిలకడగానే ఉంటాయని ఆగస్టు నెల సమయానికి రైతువారీ కొబ్బరి రూ.15 వేలుకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో గత దశాబ్ద కాలంలో ఐదింట ఒకవంతు కొబ్బరి సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పుడు ధరలు మెరుగ్గా ఉండటంతో రైతులు కొబ్బరి సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో కొబ్బరి రైతులకు సూచనలు ఇవ్వకపోవడం సబ్సిడీపై వస్తున్న ఎరువులు, పురుగుమందులు పరపతి ఉన్న రైతులకు మాత్రమే దక్కడం తదితర కారణాలు వల్ల సన్నా చిన్న కారు కొబ్బరి రైతులు సాగుపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. కొబ్బరి కొనుగోళ్లు,అనుబంధ ఉత్పత్తులకు ప్రభుత్వ పరంగా చేయూతనిస్తే కేరళ తరహాలోనే ఇక్కడి కొబ్బరికి పూర్వవైభవం వస్తుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. గోధుమ,వరి పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తున్నట్లుగానే కొబ్బరికి ఇవ్వాలని కోరుతున్నారు.

నల్ల బంగారం

బయటికొచ్చేనా..?

చింతలపూడి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు

సర్వేచేసి డ్రిల్లింగ్ జరిపిన ప్రభుత్వం

బొగ్గు నిల్వలు వెలికితీస్తే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికుల్లో ఆశలు

చింతలపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన చింతలపూడి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని సర్వేలు చేసి డ్రిల్లింగ్‌లు జరిపి నాణ్యమైన బొగ్గు ఉందని నివేదికలు ఇచ్చారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో నల్ల బంగారంతో మన దశ మారబోతుందని, తమ భూములకు విలువ రాబోతుందని ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి కాబోతుందని, పరిశ్రమలు రాక, రవాణా సౌకర్యం మెరుగుపడి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని జిల్లా వాసులు ఎన్నో కలలు కన్నారు. నివేదికలు ఇచ్చి ఆరేళ్లు గడి చినా ఇంతవరకు బొగ్గు ఊసేలేదు. ప్రజలు కన్న కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

రెండు బ్లాక్‌లుగా డ్రిల్లింగ్

సింగరేణి రాకతో తెలంగాణలో కొత్తగూడెం, మణుగూరు వంటి ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయి. చింతలపూడి సరిహద్దు సత్తుపల్లి శివారు సదాశివపేటలోను బొగ్గు తవ్వకాలు జరుగుతున్నాయి. కాగా 2014లో రాష్ట్ర విభజన తరువాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో సంపద సృష్టి, విద్యుత్ కొరత తీర్చడానికి ఏమున్నాయని ప్రభుత్వం పరిశీలించింది. చింతలపూడి ప్రాం తంలో బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని సర్వే జరిపించారు. నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించారు. చాట్రాయి మండలం సోమవరం, చింతలపూడి రెండు బ్లాక్‌లుగా ఈ ప్రాంతాల్లో డ్రిల్లింగ్‌లు జరిపారు.



వెలికితీసిన బొగ్గు నమూనాలు (ఫైల్)

1964 నుంచి సర్వే..

1964వ సంవత్సరం నుంచి ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో బొగ్గు ఖనిజం తెలుసుకోవడానికి జియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇతర సంస్థలు నాలుగు దఫాలుగా సర్వే జరిపాయి. ఆ తరువాత 2006 నుంచి 2016 వరకు సర్వేలు జరిపారు. సౌత్‌వెస్ట్ పినాకిల్ సంస్థ, ఎంఈసీఎల్ సంస్థలు సోమవరం బ్లాక్, చింతల పూడి బ్లాక్‌లను సర్వే జరిపి 120 పాయింట్లు గుర్తించి అధునాతన యంత్రాలతో డ్రిల్లింగ్ జరిపారు. ఈ 120 పాయింట్ల ద్వారా సుమారు 65 మీటర్ల లోతున బొగ్గు అన్వేషణ జరిపి సుమారు 40 వేల మీటర్ల పనులు పూర్తి చేశారు. ఇక్కడ తవ్వకాలు చేపడితే ఏడాదికి ఎనిమిది వేల మెగావాట్లు చొప్పున 60 సంవత్సరాల వరకు విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు సరిపోతుందని వివిధ సర్వే రిపోర్టులతో ప్రభుత్వం అంచనా వేసింది.

వేలంలో పాల్గొనేందుకు వెనకడుగు

కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల వేలం నిర్వహించినప్పుడు చింతలపూడి ప్రాంతంలోని ఈ రెండు బ్లాక్‌లు చేరి ఉన్నాయి. అయితే సింగరేణి సంస్థ పోటీలో పాల్గొనకపోవడంతో వేలం కూడా వాయిదా పడింది. తిరిగి రెండోసారి వేలం జాబితాను ప్రకటించగా చింతలపూడి సెక్టార్ ఎ-1, చింతలపూడి సెక్టార్ ఎ-1 (ఎస్సీ)లకు చోటు దక్కింది. బొగ్గు తవ్వకాలు ప్రారంభమైతే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రజలు భావించారు. రెండో దఫా కూడా వేలంలో ఎవరూ పాల్గొన లేదు. ఈ విధంగా ఈ ప్రాంత ప్రజలు కలలు వ్యర్థమయ్యాయి.ఎప్పటికైనా తిరిగి బొగ్గు నిల్వలు వెలికి తీస్తారా ? లేదా అనే సందేహంలో ఉన్నారు. నాణ్యమైన బొగ్గు అని చెప్పినప్పటికీ సంస్థలు ముందుకు రాకపోవడం ప్రజల్లో నిరాశ చోటు చేసుకుంది.



బొగ్గు నిక్షేపాల కోసం డ్రిల్లింగ్ జరుపుతున్న దృశ్యం (ఫైల్)



నా శత్రువు ... వర్క్ ఫ్రమ్ హోమ్ నాటకాల్లో సన్నివేశాలు

నాటక ప్రదర్శనలకు ప్రశంసలు

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నాటకం ఎవరినైనా కదిలిస్తుంది.. దానికి చావు లేదు.. బతికే ఉంటుందని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. ఏలూరులో అలపాటి రామచంద్రరావు జాతీయస్థాయి తెలుగు నాటక పోటీలు మూడో రోజు సోమవారం కొనసాగాయి. ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆద్యంతం రంజింప చేస్తున్నాయి. నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేసే శక్తి నాటికలకు ఉందన్నారు. అనంతరం రెండు నాటికలు ప్రదర్శించారు. మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ పాల్గొని నాటకాలను వీక్షించారు.

శృతి మించిన టెక్నాలజీనే 'నా శత్రువు'

ఆధునిక జీవన శైలిలో టెక్నాలజీ ఆధిపత్యాన్ని కేంద్రంగా తీసుకుని, మానవ సంబంధాల్లో ఎదురవుతున్న శూన్యతను బహిర్గతం చేస్తున్న ఇతివృత్తం 'నా శత్రువు' నాటిక. సెల్ ఫోన్, ల్యాప్‌టాప్, సోషల్ మీడియా వంటివి సమయాన్ని మింగేస్తూ మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయని ఈ నాటిక స్పష్టంగా చూపిస్తుంది. కుటుంబ సంబంధాలు, అనుబంధాల విలువ తగ్గిపోతున్న నేపథ్యంలో ఈనాటిక ఒక హెచ్చరికగా నిలుస్తుంది. జయభేరి థియేటర్స్ హైదరాబాద్ సమర్పించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.

హాస్యం పండించిన 'వర్క్‌ఫ్రమ్ హోం'

రెండో ప్రదర్శనగా సహృదయ ద్రోణాదుల వారి 'వర్క్ ఫ్రం హోం' నాటిక హాస్యాన్ని పండించింది. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లో ఉన్న మరో కోణం పాకశాస్త్రం. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ వంటలతో కూడా కుటుంబాన్ని మెప్పించేవాడు. అలాంటి వ్యక్తికి వంటే చేతగాని భార్య లభించడం, కనీసం కాఫీ పెట్టడం కూడా చేతగాని భార్య తాను సంతోషించడమే కాకుండా, తన భర్త వంటకాలను రుచి చూడాలంటూ నిత్యం బంధువులను ఇంటికి ఆహ్వానించడం, వాళ్ళు రోజులకు రోజులు ఇంట్లో బస చేయడం, వారికి వండి పెట్టేందుకు వర్క్ ఫ్రం హోం తీసుకోవడం ఆసక్తికర పరిణామం. చివరికి అటు ఉద్యోగం చేయలేక సౌమ్యలక్ష్మీ హోమ్ ఫుడ్స్ ప్రారంభించి ఉద్యోగానికి చరమగీతం పాడటం కొసమెరుపు. ఆద్యంతం నవ్వులు పువ్వులు పూయించిన నాటికకు మూల కథ కేకే భాగ్యలక్ష్మీ, నాటికీకరణ అద్దేపల్లి భరత్‌కుమార్ కాగా దర్శకత్వ బాధ్యతలను మహేంద్ర నిర్వహించారు.



తాళాబత్తుల 'భువికోరని భ్రమణం' నాటికకు ప్రత్యేక బహుమతి

పాలకొల్లు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): పాలకొల్లుకు చెందిన నాటక రచయిత, ఉపాధ్యాయుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'భువికోరని భ్రమణం' నాటికకు విశాఖపట్నం తెలుగు కళా సమితి 14వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన నాటిక పోటీల్లో ప్రత్యేక బహుమతి లభించింది. వెంకటేశ్వరరావు సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం ప్రత్యేక బహుమతి తనకు అందించారని తెలిపారు. జ్ఞాపికతో పాటుగా రూ. 5వేలు పారితోషకం అందించారని తెలిపారు.



వేడుకగా మాచేనమ్మ జాతర



ఆచంట, మే 19 (ఆంధ్రజ్యోతి):పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ జాతర ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి చిన్న జాతర కన్నుల పండుగగా జరిగింది. గరగనృత్యాలు, సన్నాయిమేళాలు, తీన్‌మార్ డప్పులు, బుట్టబొమ్మలు డ్యాన్సులు, బాణసంచా కాల్పులు మధ్య జాతర వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పెదమల్లం గ్రామం సందడిగా మారింది. మంగళవారం అమ్మవారి ఉయ్యాల ఉత్సవ కార్యక్రమంతో పాటు మధ్యాహ్నం నుంచి నిప్పుల గుండాలు తొక్కే కార్యక్రమాలు జరుగుతాయి. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు.. క్యూ కట్టిన భక్తులు

నత్తా రామేశ్వరానికి భక్తుల తాకిడి


పెనుమంట్ర, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ మాస చివరి సోమవారం కావడంతో పెను మంట్ర మండలం నత్తా రామేశ్వరంలోని పరశురాముడు ప్రతిష్ఠించిన సప్త కోటి రామలింగేశ్వర స్వామిని దర్శించు కునేందుకు భక్తులు పోటెత్తారు. సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో వేకువ జాము నుంచి భక్తులు స్వామివారిని దర్శిం చుకునేందుకు క్యూ కట్టారు. దీంతో ఆలయ వెలుపల భాగం వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు పులిహోర, శర్కర పొంగలి ప్రసాదం,మజ్జిగ, బెల్లం పానకం అందజేశారు ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ, కాశీ భట్ల సూర్యనారాయణమూర్తి స్వామివారికి పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి తమనంపూడి హరే రామ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో వేణుగోపాల్ ఏర్పాట్లు చేశారు.

11 తరాల వంశవృక్షం

సాంకేతిక పరిజ్ఞానంతో తన పూర్వీకుల చిట్టా తయారీ

ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినూత్న ఆవిష్కరణ

తణుకు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి పిల్లలకు తల్లి, తండ్రి, అమ్మమ్మ, తాతయ్య, నానమ్మలు తప్ప వారి తర్వాత, వారి తరపు వారు ఎవరైనా వస్తే ఏమవుతారో తెలియని పరిస్థితి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోయి చిన్న చిన్న కుటుంబాలుగా విడిపోయి జీవిస్తున్న తరుణంలో తన పూర్వీకుల గురించి తెలుసుకోవాలన్న ఆలోచన, తన కుటుంబంపై వున్న అమితమైన ప్రేమ కారణంగా ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీరు తన ముందు పది తరాలను గుర్తించాడు. గతంలో ఉమ్మడి కుటుంబాలలో తమ కుటుంబ వివరాలను తమ తర్వాత తరం వారికి వివరించేవారు. కాబట్టి వారిలో కొందరు తమ పూర్వీకులకు సంబంధించిన వివరాలను గుర్తు పెట్టుకుని వారి తర్వాత తరం వారికి చెప్పడం ద్వారా ముందు తరాల వారికి తెలిసేది. అయితే పూర్వం అందరూ తమ వివరాలను భద్రపరుచుకునే అవకాశం తక్కువ. తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన గుత్తికొండ మణికంఠ తను నుంచి పూర్వం 11 తరాలకు చెందిన వారి వివరాలను సేకరించి వాటిని ఆన్‌లైన్‌లో వుంచారు. దీనికోసం సుమారు సంవత్సరన్నర పాటు శ్రమించి రెండు తెలుగు రాష్ట్రాల్లో తన పూర్వీకులకు సంబంధించిన వారిని కలుసుకుని వారి వివరాలతో ఒక జాబితాను తయారు చేశాడు. మణికంఠ కాకినాడ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల నుంచి బీటెక్ ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఇంటినుంచే ఉద్యోగం చేస్తున్నారు. మణికంఠ తన కుటుంబంతో బంధువుల ఇళ్లలో జరిగే శుభ కార్యాలకు వెళ్లినప్పుడు అక్కడ చేరిన బంధువులు ఒకరినొకరు పలకరించుకునేవారని.. ఎవరికి ఏమవుతారు ? అనేది తెలియక తికమక పడేవాడినని అందుకే తన పూర్వీకుల వివరాలు సేకరించాలనే ఆసక్తి పెరిగిందన్నాడు. పూర్వీకుల వివరాల కోసం మణికంఠ తండ్రి రాము తన పెద్దమ్మ బాపనమ్మను సంప్రదించారు.



మణికంఠ తయారు చేసిన తన వంశ వృక్షావళి చార్టు (డిజిటల్ ఫ్యామిలీ ట్రీ)

ఆధునికంగా వంశవృక్షం

ముత్తాత లిఖించిన తన పూర్వీకుల వివరాలు, పెద నాన్నమ్మ నుంచి తండ్రి సేకరించిన వివరాల ఆధారంగా మణికంఠ అత్యంత ఆధునికంగా తన వంశ వృక్షావళిని రూపొందించారు. 11 తరాలకు చెందిన కుటుంబంలోని ప్రతీ ఒక్కరికీ ఒక ఫోల్డర్‌ను రూపొందించారు. అందరూ చూడగలిగే విధంగా వెబ్‌సైట్‌లో తన వంశవృక్షం వివరాలను పొందుపర్చారు.వెబ్‌సైట్‌లో ఫొటోపై క్లిక్ చేస్తే ఆ వ్యక్తి ఫొటో, ఆవ్యక్తి వివరాలు, లభ్యమయ్యేలా రూపొందించారు. ఈ వంశ వృక్షంలో 18వ శతాబ్దంలో నివశించిన తన వంశానికి చెందిన శోభనాద్రి నుంచి మణికంఠ వరకూ వివరాలు వెబ్‌సైట్‌లో వున్నాయి.



పూర్వీకులు ఎవరో తెలుసుకోవాలనే ...

నా కుటుంబం అంటే ప్రేమ.. అందుకే సంవత్సరంన్నర కాలంగా బంధువుల ఇళ్లల్లో జరిగిన శుభ కార్యక్రమాల్లో పాల్గొని అక్కడ బంధువుల నుంచి పూర్వీకుల వివరాలు అడిగి తెలుసుకుని వాటికి అక్షర రూపం ఇచ్చాను. మా ముత్తాత చిట్టబ్బాయి లిఖించిన వుంచిన ఆరు తరాల వివరాలు, తన తండ్రి బాపనమ్మ చెప్పడం ద్వారా రాసిన పూర్వీకుల జాబితా ఆధారంగా కంప్యూటర్ పరిజ్ఞానంతో ప్రతీ వ్యక్తికి సంబందించిన పూర్తి వివరాలతో ఫోల్డర్‌ను రూపొందించాను. 154 మందికి స్క్రీన్ తయారు చేసి వారి వివరాలు లోకేషన్ పాటు మొత్తం వివరాలు ఆన్‌లైన్‌లో వుంచాను.

-గుత్తికొండ మణికంఠ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, తేతలి



మంత్రి నాదెండ్లకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

పదోన్నతులకు రిజర్వేషన్ వర్తింపజేయాలి

మంత్రి నాదెండ్లకు అరుంధతీయ ఉద్యోగ జేఏసీ వినతి

ఏలూరు టూటౌన్, మే19 (ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింప చేయాలని అరుంధతీయ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జేఏసీ జోనల్ చైర్మన్ జె.వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఏలూరు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్‌కు సంబంధించిన గెజిట్‌లో పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలు చేయాలని ఉందన్నారు. కానీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 46 పదోన్నతి విషయాన్ని మరచిపోయారన్నారు. దీంతో ఎంతో మంది ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిశీలించి పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించే జీవోను విడుదల చేయాలని యూనియన్ నాయకులు వి.మధుశేఖర్ కోరారు. కార్యక్రమంలో ఎం.సూరిబాబు, ఎన్.బాబురావు పాల్గొన్నారు.



కలెక్టర్ వెట్రిసెల్వికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

‘ఆదరణ’ పరికరాలు కొట్టేశారు

- అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్‌కు ఎమ్మెల్యే చింతమనేని ఫిర్యాదు

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): దెందులూరు నియోజకవర్గంలో ఆదరణ పథకంలో లబ్ధిదారులకు అందాల్సిన పరికరాలు వైసీపీ నేతలు తరలించుకుపోయారని, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలెక్టర్ వెట్రిసెల్విని కోరారు. కలెక్టరేట్ సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. 2019కి ముందు అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో తన నియోజకర్గం పరిధిలోని బీసీ సామాజిక వర్గాల వారి వృత్తి, ఉపాధికి సహకరించేలా ఆదరణ పథకంలో వాషింగ్ మిషన్లు, సెలూన్ చెయిర్లు వంటి పరికరాలు 90 శాతం సబ్సిడీపై అందించేలా చర్యలు చేపట్టామన్నారు. పరికరాలు లబ్ధిదారులకు పంపిణీ సమయంలో ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిందన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, అతని తండ్రి రామచంద్రరావు బీసీ కార్పొరేషన్ గోడౌన్‌లో ఉన్న పరికరాలను అక్రమంగా తరలించుకుపోయారన్నారు. లబ్ధిదారులకు అందాల్సిన పనిముట్లను అవినీతి అధికారుల సహకారంతో అక్రమంగా తరలించి అమ్ముకున్నారని చింతమనేని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాధితులకు భరోసా ఇచ్చారు.



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

రేపు టీచర్ల డీఈవో కార్యాలయ ముట్టడి

- బదిలీలు, రేషనలైజేషన్ నిర్ణయాలపై నిరసన

ఏలూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియల్లో ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 21న డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఏలూరులోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి, తెలుగు సమాంతర సెక్షన్లను ప్రారంభించాలన్న అభ్యర్థన, మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలన్న సూచనను ఉన్నతాదికారులు ఎంతమాత్రం పట్టించుకోకపోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తిగా గందరగోళంగా తయారైందని ఆరోపించారు. డీఈవో కార్యాలయం వద్ద ఆందోళనకు జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శామ్యూల్, పవన్ కుమార్, రంగమోహన్, అలీ, సాంబశివరావు, రామ్మోహన్, ధర్మారావు, మురసలీన్, శ్రీనివాసరావు, రమేశ్, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 21 నుంచి ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని ఆర్ఐవో యోహాన్ తెలిపారు. స్పాట్ వాల్యూయేషన్ క్యాంపు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏలూరులో మాత్రమే జరుగుతుందని వివరించారు. మూల్యాంకనం విధులకు సీఈలు, ఎగ్జామినర్లు 21న ఉదయం 10గంటలకు, పరిశీలకులు 22న స్పాట్ క్యాంపు ఆఫీసర్‌వద్ద రిపోర్టు చేయాలన్నారు. వారిని ఉమ్మడి జిల్లాలోని సంబంధిత కళాశాలల విధుల నుంచి రిలీవ్ చేయాలని ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. కాగా సప్లిమెంటరీ బ్రిడ్జికోర్సుల పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు జిల్లాలో 659 మంది విద్యార్థులకు 328 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 151మందికి 125మంది హాజరయ్యారని వివరించారు.



అత్తిలిలో సూర్యారావుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి, ఎమ్మెల్యే



యలమంచిలి ఎంపీపీగా ధ్రువీకరణ పత్రం అందుకున్న ధనలక్ష్మి



కైకలూరు వైస్ ఎంపీపీ 2 వెంకట నరసమ్మకు ఎమ్మెల్యే అభినందన

మండల పరిషత్ ఉప పోరు

అత్తిలి, యలమంచిలిలో ప్రశాంతంగా ఎన్నిక

అత్తిలి ఎంపీపీ పీఠం కూటమి కైవసం

అత్తిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండల పరిషత్ అధ్యక్షుడిగా కూటమి తరఫున నక్కా సూర్యారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా కొనకళ్ళ విజయనిర్మల ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిమిత్తం మండల పరిషత్ ప్రత్యేక సమావేశం ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మండలంలో 20 మంది ఎంపీటీసీలు ఉండగా ఒక ఎంపీటీసీ అనర్హురాలు కావడంతో 19 మంది ఎన్నికైన ఎంపీటీసీలు, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డీవో కతీబ్ కౌసర్ బానో సమావేశంలో పాల్గొన్నారు.

ఎంపీపీగా నక్కా సూర్యారావు పోటీలో ఉండగా ఆయనకు 11 ఓట్లు, వైసీపీ అభ్యర్థి రాంభ సుజాతకు 8 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా కొనకళ్ళ విజయనిర్మల ఎన్నికయ్యారు. ఆమెకు 11 ఓట్లు రాగా, వైసీపీ తరఫున పోటీ చేసిన అద్దంకి శ్రీనుకు 8 ఓట్లు వచ్చాయి. ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులు రెండు కూటమి పార్టీలు బలపర్చిన అభ్యర్థులే గెలిచారు. వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అత్తిలి మండల పరిషత్ అధ్యక్షుడిగా గతంలో నక్కా సూర్యారావు ఎన్నిక కాగా ఎన్నికల్లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీలో చేరారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఎంపీపీగా మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు వ్యవహరించారు. మండల పరిషత్ ఎన్నిక గతంలో నిర్వహించడానికి ప్రయత్నించగా ఎన్నిక కార్యక్రమానికి ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో అధికారులు ఎన్నిక ప్రక్రియను వాయిదా వేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, కోఆప్షన్ సభ్యులు అభినందించారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు పార్టీ జెండాలతో ఎంపీపీ కార్యాలయం వద్ద మోహరించారు. కూటమి అభ్యర్థి గెలిచారనే సమాచారం తెలపడంతో పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు.

యలమంచిలి ఎంపీపీగా ధనలక్ష్మి

యలమంచిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండల పరిషత్ అధ్యక్షురాలిగా వైసీపీకి చెందిన ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు ఇనుకొండ ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా పీడీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కేసీహెచ్.అప్పారావు ఎంపీపీ ఎన్నికను సోమవారం నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి ఇనుకొండ ధనలక్ష్మి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి ధనలక్ష్మికి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం ఎంపీపీగా ఎన్నికైన ధనలక్ష్మితో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికకు వైసీపీకి చెందిన 12మంది ఎంపీటీసీ సభ్యులు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ హాజరయ్యారు. ఎన్డీఏ కూటమికి చెందిన నలుగురు ఎంపీటీసీ సభ్యులు, ఇటీవల టీడీపీలో చేరిన మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు ఎన్నికకు గైర్హాజరయ్యారు. ఎంపీపీగా ఎన్నికైన ఇనుకొండ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. తనను ఎంపీపీగా ఎన్నుకున్న ఎంపీటీసీ సభ్యులకు, సహకరించిన వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కైకలూరు వైస్ ఎంపీపీ2 టీడీపీ కైవసం

కైకలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైస్ ఎంపీపీ-2 ఉప ఎన్నికలో టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు గంగుల వెంకట నరసమ్మను ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ ఉప ఎన్నికకు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జేసీ ధాత్రిరెడ్డి పర్యవేక్షించారు. మార్చి 26న వైస్ ఎంపీపీ ఎండీ జహీర్ రాజీనామాతో ఉప ఎన్నిక నిర్వహించారు. కూటమికి చెందిన ఎంపీటీసీలు 10మంది హాజరుకాగా తామరకొల్లు ఎంపీటీసీ సభ్యురాలు గంగుల వెంకట నరసమ్మను ప్రతిపాదించి ఎన్నుకున్నారు. వైసీపీకి చెందిన 8 మంది ఎంపీటీసీలు హాజరైనప్పటికీ సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. గంగుల వెంకటనరసమ్మను గెలిపించడంపై కూటమి నేతలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు కూటమి నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఎంపీపీ అడవి కృష్ణ, నేతలు బీకేఎం నాని, పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, కొల్లి బాబి, చెరుకువాడ బలరామరాజు పాల్గొన్నారు.

అమ్మో.. రక్త పరీక్షలు



పుట్టగొడుగుల్లా వెలసిన డయాగ్నొస్టిక్ సెంటర్లు



పూర్వ కాలం వైద్యులు నాడి పట్టుకుని రోగం కనిపెట్టి వైద్యం చేసేవారని విన్నాం. ఇప్పుడు రోగి డబ్బు పట్టుకుంటేనే రోగం నయం అవుతుంది. వైద్యుడిని కలిసిన తర్వాత డయాగ్నొస్టిక్ సెంటర్‌లో అన్ని పరీక్షలు చేయించుకుంటే డాక్టర్ వైద్యం చేస్తారు. కానీ రక్త పరీక్షలతో మాత్రం అమాయక ప్రజలు నష్టపోతున్నారు. కొన్ని డయాగ్నొస్టిక్ సెంటర్లలో అనుభవం, అర్హత లేని టెక్నీషియన్లు, అధిక చార్జీలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు

- అర్హత, అనుభవం లేని టెక్నీషియన్లు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- రోగం లేకున్నా ఉన్నట్లు రిపోర్టు
- మరో ల్యాబ్‌లో టెస్ట్‌చేస్తే సాధారణం!
- అయోమయంలో రోగులు
- నిబంధనలు బేఖాతరు

భీమవరం క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లా వెలసిన డయాగ్నోస్టిక్ సెంటర్లలో టెక్నీషియన్ల (రక్త పరీక్షలు చేసేవారు) అనుభవం లేమితో లేని రోగాన్ని కూడా ఉన్నట్లు నిర్ధారిస్తున్నారని పలువురు గగ్గోలు పెడుతున్నారు. కొందరు తమకు రోగం ఉందని భయంతో వైద్యునికి చెబితే అసలు విషయం బయటపడుతోంది. మరోసారి వైద్యుని సూచనలతో మరో చోట రక్త పరీక్షలు చేయించుకుంటే ఏ రోగం లేదని నిర్ధారణ కావడంతో రోగులు అయోమయంలో పడుతున్నారు. మరి కొందరు వైద్యులు వారు పంపించిన డయాగ్నోస్టిక్ సెంటర్‌కే వెళ్లాలని చెబుతున్నారు. అక్కడే రక్త పరీక్షలు చేయించుకుని రోగం ఉన్నా, లేకున్నా వైద్యం పొందుతున్నారు. ఈ రకంగా చాలా మంది అమాయకులు వైద్యం పేరిట మోసపోతున్నారు.

జిల్లాలో 198 డయాగ్నోస్టిక్ సెంటర్లు

పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 198 డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యులే రక్తపరీక్షా కేంద్రాలు కూడా నడుపుతున్నారు. వాటితో కలిపితే సుమారు 500 రక్తపరీక్షా కేంద్రాలు ఉన్నట్లు అంచనా. రోజుకు సుమారు 25 వేల మంది వరకు రక్తపరీక్షలు చేయించుకుంటున్నారు. కొన్ని రక్త పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అర్హత, అనుభవం లేని టెక్నీషియన్లు చక్రం తిప్పుతున్నారు. రక్త పరీక్ష చేయాలంటే ఎంఎల్‌టి చదివి రెండేళ్ల శిక్షణ పొందాల్సి ఉంటుంది. అవేమీ లేనివారిని కొన్ని చోట్ల టెక్నీషియన్లుగా ఏర్పాటు చేస్తున్నారు. వారికి తక్కువ వేతనంతో పనిచేయించి రోగుల జీవితాలతో ఆటలాడుతున్నారు. ప్రతి డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉంది. రక్త పరీక్ష కేంద్రాలకు నిర్దిష్ట ప్రమాణాలతో గదులు ఉండాలన్న నిబంధన ఉంది. అవేమీ పట్టనట్లుగా కొందరు దళారులు ఇష్టానుసారంగా రక్త పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

భీమవరం పట్టణంలోని ఒక ల్యాబ్‌లో 50 ఏళ్ల వ్యక్తి రక్త పరీక్షలు చేయించుకున్నారు. రక్తం బాగా తక్కువగా ఉందని నిర్ధారణ కావడంతో ఖంగుతిన్నాడు. వెంటనే వైద్యుని వద్దకు వెళ్లి రిపోర్టు చూపించగా వైద్యులు కూడా కంగారు పడ్డారు. అంత రక్తం తక్కువగా ఉంటే మనిషి ప్రాణానికే ముప్పు అని వైద్యుని సలహా మేరకు మరో రక్తపరీక్ష కేంద్రంలో పరీక్ష చేయిస్తే సాధారణంగా ఉందని తేలింది.

బంధువులతో కలిసి 8 నెలల గర్భిణి ఆసుపత్రికి వెళ్ళింది. వైద్యులు రక్త పరీక్షలు చేయించుకోమని సూచించారు. ప్రైవేట్ రక్తపరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకోగా థైరాయిడ్, షుగర్ ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. వైద్యునికి చూపించగా అనుమానం వచ్చి మరో రక్తపరీక్ష కేంద్రానికి పంపించాడు. అక్కడ సాధారణమని రిపోర్టు వచ్చింది. దీనితో ముందు పరీక్ష చేయించుకున్న కేంద్రానికి వెళ్లి నిలదీశారు. ఆ కేంద్రం నిర్వాహకులు కాళ్ల బేరానికి వచ్చి క్షమాపణలు కోరాడు.

అనుమతి లేకుండా రక్తపరీక్షలు చేస్తే కఠిన చర్యలు : గీతాబాయి, జిల్లా వైద్యాధికారి

ఎవరైనా అనుమతులు లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా రక్త పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్లను నడిపితే నోటీసులు ఇచ్చి పై అధికారుల ఆదేశాలతో వాటిని సీజ్ చేస్తాం. ప్రస్తుతానికి జిల్లాలో ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. ఎవరైనా ల్యాబ్‌లు నిర్వహిస్తే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అలాగే అనుభవం ఉన్న, అర్హత ఉన్న టెక్నీషియన్లను మాత్రమే వినియోగించాలి. అలా కాదని ఎవరైనా వ్యతిరేకిస్తే చర్యలు తప్పవు.

హెడ్ కానిస్టేబుల్‌పై కొడుకు, కోడలు దాడి

ఆస్తి రాసివ్వాలని వీరంగం

ఏలూరు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకే ఆస్తికోసం తల్లిదండ్రులపై దాడి చేశాడు. భార్య అత్తమామలతో కలిసి వీరంగం చేశాడు. హెడ్‌కానిస్టేబుల్ చేయి విరిగింది, అతడి భార్యకు గాయాలయ్యాయి. పెదవేగి మండలం ఒంగూరు గ్రామానికి చెందిన మిరియాల గంగరాజు ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అతని కుమారుడు దినేష్ కుమార్‌కు 2022లో ఏలూరు రూరల్ మండలం కాట్లంపూడి గ్రామానికి చెందిన మల్లేశ్వరితో వివాహం చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్న దినేష్‌కుమార్ తల్లి కనకదుర్గ పేరుతో ఉన్న ఇంటిని తనకు రాసేయాలని గొడవ చేశాడు. అప్పట్లో పెదవేగి ఎస్ఐకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వార్నింగ్ ఇచ్చి పంపించి వేశాడు. తిరిగి దినేష్‌కుమార్, అతని భార్య మల్లేశ్వరి, అతని మామ కాట్లంపూడికి చెందిన హనుమంతరావు, అత్త దయామణి, బావమరిది వెంకట్ కలిసి సోమవారం గంగరాజు, గంగరాజు భార్య కనకదుర్గపై దాడిచేశారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గంగరాజును 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ఎక్స్‌రే తీసి అతని చేయి విరిగిందని నిర్ధారించి ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భార్యతో గొడవపడి అత్తపై హత్యాయత్నం

యువకుడి అరెస్ట్

ఏలూరు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడిన యువకుడు అడ్డు వచ్చిన అత్త నోట్లో పురుగుమందుపోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిందితుడిని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు సోమవారం అరెస్టు చేశారు. ఏలూరు నల్లదిబ్బ ప్రాంతానికి చెందిన సజ్జా వెంకటలక్ష్మి కుమార్తెను కట్టా రాజేష్ (21)తో వివాహం చేయగా కొంత కాలం హైదరాబాద్‌లో ఉన్నాడు. వెంకటలక్ష్మి కుమార్తెను చిత్రహింసలకు గురి చేయడంతో ఆమె ఏలూరు పుట్టింటికి వచ్చేసింది. రాజేష్ కూడా వచ్చి ఈనెల 17న గొడవ పెట్టుకున్నాడు. అడ్డు వచ్చిన వెంకటలక్ష్మి నోట్లో పురుగుమందు పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి కట్టా రాజేష్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు. దీంతో జిల్లా జైలుకు తరలించారు.

కుంచనపల్లి హైవేపై కారు బోల్తా



కుంచనపల్లి వద్ద పల్టీ కొట్టిన కారు

తాడేపల్లిగూడెం రూరల్, మే19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న కారు కుంచనపల్లి వద్ద ఒక్కసారిగా పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి బోల్తా పడింది. హైవేపై సోమవారం ఉదయం హైవే పై నుంచి కారు పల్టీలు కొడుతూ బోల్తా కొట్టిన సంఘటన స్థానికంగా సంచలనం రేగింది. విజయవాడ నుంచి తణుకు వైపు వెళుతున్న మహిళ నిద్ర మత్తులో కారు అదుపు చేయలేకపోయింది. ఒక్కసారిగా పల్టీలు కొట్టింది. పెద్ద ప్రమాదం జరిగిందని స్థానికులు కంగారు పడ్డారు. కాగా ఈ ప్రమాదంలో ఆ మహిళకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు.



ప్రమాద స్థలంలో సన్నిబాబు మృతదేహం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఆచంట, పెంటపాడు మండలాల్లో సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా గణపవరం మండలంలో కాల్వలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రెండు ప్రమాదాల్లో యువకులు ఇటీవల ఇంటర్ ఉత్తీర్ణులు కావడం యాధృచ్చికం. కోడేరు వద్ద జరిగిన ప్రమాదంలో యువకుడు చదువుకుంటూనే ఫొటో స్టూడియోలో పని చేస్తున్నారు. పెంటపాడు వద్ద మృతి చెందిన యువకుడు కంప్యూటర్ క్లాసులకు వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు.

ఆచంట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడేరు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పాలకొల్లుకు చెందిన గెడ్డం సన్నిబాబు (18) తన స్నేహితులతో కలిసి సోమవారం పెనుమంచిలి గ్రామంలో ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లారు. అక్కడి నుంచి కోడేరులో స్నేహితుడి ఇంటికి వెళ్లారు. కోడేరు నుంచి తిరిగి తన అమ్మమ్మ ఊరు పెనుగొండ మండలం దేవ శివారు తాళ్లపాలెం మోటారుసైకిల్ పై వెళుతున్నాడు. ఆచంట వైపు నుంచి కోడేరు వైపు వెళుతున్న భార్యతో కలసి వెళుతున్న యన్నాబత్తుల సత్యనారాయణ మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సన్నిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా గన్నవరం మండలం లంకల గన్నవరం శివారు నడిగడికి చెందిన యన్నాబత్తుల సత్యనారాయణ, అతడి భార్యకు తీవ్ర గాయాలు కావడంతో పాలకొల్లు ఆసుపత్రికి 108లో తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటరమణ సంఘటనను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇటీవలే ఇంటర్ పాసయ్యాడు..

పెనుగొండ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సన్నిబాబు ఇటీవల వచ్చిన ఫలితాల్లో ఉత్తీర్ణుడయ్యాడు. చదువుకుంటూనే ఏడాది నుంచి పాలకొల్లులోని ఒక ఫొటో స్టూడియోలో ఎడిటింగ్ పని చేస్తున్నాడు. పాలకొల్లు నుంచి ప్రతీ రోజూ తన అమ్మమ్మ ఊరు తాళ్లపాలెం వెళుతుంటాడు. సన్నిబాబుకు ఒక చెల్లెలు ఉంది. తల్లి దుబాయ్‌లో ఉంటుంది. తండ్రి పాలకొల్లులో కూలీ పనులు చేసుకుంటూ ఉంటాడు.

కంప్యూటర్ క్లాస్‌కు వెళుతూ..

పెంటపాడు, మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ క్లాస్‌కు వెళుతున్న యువకుడు మృతి చెందాడు. మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన యర్రంశెట్టి వీర వెంకట సత్యనారాయణ అలియాస్ సతీష్(17) ఇంటర్ పూర్తి చేసుకుని తాడేపల్లిగూడెంలో కంప్యూటర్ క్లాస్‌కు వెళుతున్నాడు. సోమవారం కూడా యధావిధిగా క్లాస్‌కు వెళ్లి తిరిగి తన ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా పెంటపాడు కాలేజ్ సెంటర్ సమీపంలో వైజాగ్ నుంచి భీమవరం వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

గణపవరం, మే19 (ఆంధ్రజ్యోతి): గణపవరం పిప్పర నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రహదారిలోని కనకదుర్గమ్మ గుడి ఎదురుగా పంటకాల్వలో 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉంది. సోమవారం వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు గణపవరం ఎస్సై ఆకుల మణికుమార్ వెలికితీసి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తెలియజేయాలని ఎస్సై కోరారు. మృతదేహంపై ఎటువంటి గాయాలుకానీ, ఏమిలేవని ఆయన తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

లింగపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో పాము కాటులో మహిళ మృతి చెందింది. సింగగూడెం శివారు ఆదర్శనగర్‌కు చెందిన సేవా మరియమ్మ(58) బుధవారం రాత్రి ఇంటిముందు కూర్చొని ఉండగా పాము కాటు వేసింది. ఆమె భయంతో కేకలు వేయగా కుటుంబ సభ్యులు వెంటనే చింతల పూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

పారిజాతగిరిలో అంకురార్పణ

జంగారెడ్డిగూడెం,మే 19 (ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం అంకురార్పణ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, ఋషికేష్ ఆచార్యులు, ఉమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ మానికల రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, వాసవీ సాయి నగేష్, చింతలపాటి వెంకటరామరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు వాయిదా

పోలవరం, మే 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌లో స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20,21 తేదీలలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు సాంకేతిక సమస్యల వలన వాయిదా వేసినట్టు ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు నిర్ణయించిన అనంతరం అభ్యర్థులకు తెలియజేయడం జరుగుతుందన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ప్రారంభం

(ఐదో పేజీ తరువాయి)

సోమవారం జిల్లా కేంద్రంలోని మూడు కేంద్రాల్లో ప్రారంభమైంది. తొలి రెండురోజులు వ్యవసాయ, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రంలో ఉదయం షిఫ్టులో జరిగిన పరీక్షకు 161 మంది విద్యార్థులకు 152 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 157 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఉదయం 191 మందికి 180, మధ్యాహ్నం 190 మందికి 184 మంది హాజరయ్యారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి ఉదయం 150 మందికి 140, మధ్యాహ్నం 137 మంది హాజరయ్యారు. మొత్తంమీద ఉదయం షిఫ్టు పరీక్షకు 30 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 23 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

టెన్త్, దూరవిద్య ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

పదో తరగతి, దూరవిద్య ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమ య్యాయి. టెన్త్ తెలుగు పరీక్షకు జిల్లాలో 1,615 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 779 మంది హాజరయ్యారు. సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ ఇంగ్లీషు పరీక్షకు 81 మంది దరఖాస్తు చేసుకోగా 61 మంది హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

మారుతున్న జీవనశైలి క్యాన్సర్‌కు కారణం


వైద్యశిబిరం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లే క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు అవసరమన్నారు. ఆరోగ్యవంతంగా జీవించడానికి ఆహారపు అల వాట్లు, జీవనవిధానాలు మెరుగుపరుచుకోవాలన్నారు. తొలిదశలోనే క్యాన్స ర్‌ను గుర్తిస్తే నివారించవచ్చని అన్నారు. అనంతరం వైద్యులు, పారిశుధ్య కార్మికులకు, ఇతర ఉద్యోగులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ భానుప్రతాప్, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణతో మహిళలకు ఉపాధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి) : సాంకేతి క శిక్షణ ద్వారా మహిళ లు ఉపాధి అవకాశాలు పొందవచ్చునని ఎమ్మె ల్యే సొంగా రోషన్‌కుమా ర్ అన్నారు. స్థానిక ఎంపీ డీవో కార్యాలయ ఆవరణలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా చింతలపూడి రూరల్, పట్టణ స్థాయిలో రెండు బ్యాచ్‌లుగా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తారని, ఒక్కొక్క బ్యాచ్‌కు 60 మంది చొప్పున శిక్షణ పొందవచ్చునని తెలిపారు.

సారా మరణాలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు పట్ల హర్షం

జంగారెడ్డిగూడెం,మే 19 (ఆంధ్రజ్యోతి): 2022లో జంగారెడ్డిగూడెంలో జరిగిన వరుస నాటు సారా మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 27 మంది కల్తీ సారా తాగి మృతి చెందితే అప్పటి ప్రభుత్వ పెద్దలు కనీసం పట్టించుకోకుండా ఆ మరణాలు సాధారణ మరణాలని ఆ కుటుంబాలను గాలికి వదిలేశారన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నిడమర్రు మే 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి కుటుంబం నూతన రేషన్‌కార్డుల కోసం గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని నిడమర్రు తహసీల్దార్ ఎన్. నాగరాజు సూచించారు. సోమవారం నిడమర్రు తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించామని ఇప్పటివరకు 337 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మార్పులు చేర్పులు 280, కొత్త రేషన్ కార్డుల కోసం 25, విభజన కార్డులు 24, చిరునామా మార్పులు 8 వచ్చాయన్నారు. ఈ దరఖాస్తులు వెంటనే ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు.

హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించాలి

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు తక్షణమే ప్రమోషన్ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఏపీ యునైటెడ్ వార్డ్ విలేజ్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డీఎస్వీడి ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో హెల్త్ సెక్రటరీలకు ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) లుగా ప్రమోషన్లు కల్పించడంలో ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సెలక్షన్ లిస్ట్ ప్రకటించి, కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేయాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.

61 వాహనాలపై కేసుల నమోదు

ఏలూరు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు రవాణాశాఖ అధికారులు తమ పరిధిలోని ప్రాంతాల్లో వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 61 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసి లక్షా 56 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు దెబ్బతగలడం వల్ల మరణిస్తున్నారని అదే హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చునని సూచించారు.

యువకుడిపై ఇద్దరు దాడి: సెల్‌ఫోన్ అపహరణ

ఏలూరు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు చాణిక్యపురి కాలనీకి చెందిన సప్పా సాయిమౌనీషా ఈనెల 18వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో సిగరెట్ తాగడానికి సమీపంలోని కిళ్ళీ షాపు వద్దకు వెళ్తుండగా రూప్‌చంద్, అభిషేక్ అనే యువకులు ఆపి మద్యానికి డబ్బులు ఇవ్వాలని అడిగారు. మీరు ఎవరో తనకు తెలియదని ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో సమీపంలోని చీకటి ప్రాంతానికి తీసుకుపోయి చితకబాది అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. టూటౌన్ సీఐ కె అశోక్‌కుమార్ రూప్‌చంద్, అభిషేక్‌ల కోసం గాలింపు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెదపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడిలో తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వీరి వద్ద నుంచి నుంచి రూ.10,650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానం



ఉంగుటూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ గుత్తికొండ అప్పారావు (83)సోమవారం నాడు మృతి చెందారు. కాగా ఆయన నేత్రదానానికి అంగీకరించడంతో నిడదవోలు రమణమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంకు వారికి తెలపడంతో వారి సిబ్బంది కైకరం వచ్చి అవయవాన్ని సేకరించారు.

కార్యకర్తలే పార్టీకి ఊపిరి

పోలవరం మినీ మహానాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని


గణపవరంలో జరిగిన ఉంగుటూరు మినీ మహానాడులో మాట్లాడుతున్న గన్ని

కొయ్యలగూడెం, మే19 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి ఊపిరని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. ఈ మేరకు సోమవారం కొయ్యలగూడెం మార్కెట్‌యార్డులో పోలవరం నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అంకితభావంతో పని చేసినప్పుడే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. అటువంటి కార్యకర్తలు టీడీపీలో ఉన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పోలవరం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు నారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, గంగిరెడ్ల మేఘలాదేవి, చింతల వెంకట్రమణ పాల్గొన్నారు.

బలహీనవర్గాల కోసమే టీడీపీ ఆవిర్భావం

గణపవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భవించిందని ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. సోమవారం ఉంగుటూరు నియోజకవర్గ మినీ మహానాడు గణపవరంలోని కేవీపీ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. తొలుత నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉంగుటూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దటంలో ఎనలేని కృషి చేశామని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని గన్ని అన్నారు. రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో పార్టీ కోసం శ్రమించిన నేతలందరికి చంద్రబాబు నాయుడు తగిన పదవులు ఇచ్చి గుర్తింపు ఇచ్చారని అన్నారు. మినీ మహానాడులో ఐదు తీర్మానాలను గన్ని ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ కరణం పెద్దిరాజు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు సురేంద్రకుమార్‌రాజు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ప్రణాళిక

బుజ్జి, కార్యదర్శి, ఉప్పలపాడు



- **స్వచ్ఛాంధ్ర ఎక్కడ అమలు చేస్తున్నారు ?**
జవాబు: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలను అన్ని వార్డుల్లోను అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం.
- **పంచాయతీ పన్నుల వసూళ్ల వివరాలు ?**
జవాబు : ఇంటి పన్నులు, మంచినీటి కుళాయి పన్నుల ద్వారా రూ. 5 లక్షలు రావాల్సి ఉండగా ఇప్పటికి రూ. 4 లక్షలు వరకు వసూలు చేశాం.
- **ఉపాధి పనుల ప్రగతి ?**
జవాబు : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి పనులను ప్రతిపాదించాం.
- **మంచినీటి సౌకర్యాల వివరాలు ?**
జవాబు : ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తగినన్ని క్లోరినేషన్ చేసిన మంచినీటిని అన్ని వార్డులకు సరఫరా చేస్తున్నాం.

- కామవరపుకోట (ఆంధ్రజ్యోతి)

కొయ్యలగూడెంలో తిరంగా ర్యాలీ


కొయ్యలగూడెంలో జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, తదితరులు

కొయ్యలగూడెం, మే19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడానికి ప్రధాన మంత్రితో పాటు వివిధ త్రివిధ దళాలు కృషి అని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఉదయం కొయ్యలగూడెంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మలకిషోర్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు నారాయణ, శుభద్రాదేవి, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, మండల బీజేపీ అధ్యక్షులు గొలిశెట్టి వాసు, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, మేఘలాదేవి, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్ పాల్గొన్నారు.

శేషాచలంపై దుకాణాల్లో ప్లాస్టిక్ తనిఖీలు



ద్వారకాతిరుమల, మే 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలంపై ఉన్న ఫ్యాన్సీ దుకాణాల్లో వాటి యజమానుల ప్లాస్టిక్ వినియోగంపై ఆలయ అధికారులు, సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో రెండు దుకాణాలు అధికంగా ప్లాస్టిక్ వాడకాలు జరుపుతుండటాన్ని గుర్తించి వారిని హెచ్చరించారు. ఇకపై దేవాలయ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతరాల వినియోగం జరిగితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని, ప్రస్తుతం జరిమానా విధిస్తున్నట్లు చెప్పి ఆ దుకాణదారులకు ఫైన్ వేశారు.

ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

బుట్టాయగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేస్తూ గిరిజన సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కుర్సం సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలకు సరైన రోడ్డుమార్గాలు లేవన్నారు. ఏజెన్సీలో నెలకొన్న భూవివాదాలపై రెవిన్యూ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

కొనసాగుతున్న గిరిజనుల దీక్షలు

బుట్టాయగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు ఇవ్వాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని ఏజేఏసీ పిలుపు మేరకు మండల కేంద్రంలో గిరిజనులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ప్రభుత్వం స్పందించి ఆదివాసీలకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

బ్యాంకు ఖాతాల సమస్య పరిష్కారం

బుట్టాయగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): గాడిదబోరు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలకు చెందిన బ్యాంక్ ఖాతాల్లో నెలకొన్న సమస్యను వెలుగు, బ్యాంక్ అధికారులు మహిళలతో చర్చించి పరిష్కరించారు. తెలియకుండానే ఖాతాల్లో డబ్బులు జమచేసి వడ్డీల రూపంలో ఖాతాల నుంచి డబ్బును జమచేసుకోవడంతో డ్వాక్రా మహిళలు అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. సోమవారం వెలుగు, రెడ్డిగణ పవరం బ్యాంక్ అధికారులు సమక్షంలో మహిళలతో మాట్లాడి పరిష్కరించారు.

మినీ మహానాడుకి తరలిన టీడీపీ నేతలు

పోలవరం మే 19(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెంలో జరిగే మినీ మహానాడుకు పోలవరం నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు తెరలివెళ్లారు. పోలవరం పంచాయతీ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో కొయ్యలగూడెం తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ, యువజన నాయకులు ఆకుల రాజా, ఎస్సీ సెల్ నాయకల యడ్ల వినోద్, పొట్నూరి నారాయణరావు, కంభంపాటి గోపి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి రైతుల సమస్యలు

జీలుగుమిల్లి, మే 19: (ఆంధ్రజ్యోతి) : సొసైటీల్లో రుణాలు పొందిన రైతుల పరువు తీసే ప్రకటనల వల్ల రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని గిరిజన రైతులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు మొరపెట్టుకున్నారు. బర్రింకలపాడులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. సొసైటీలకు ఓటీఎస్(ఒన్‌టైం సెటిల్‌మెంట్) వర్తించేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తమ సమస్యల్ని పరిష్కరించాలని రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

వీఆర్వోల సమస్యలపై వినతి

కామవరపుకోట, మే 19 (ఆంధ్రజ్యోతి) : రేషనలైజేషన్ క్లస్టర్ విధానంలో వీఆర్వోల కేడర్ బలాన్ని తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల కామవరపుకోట మండల వీఆర్వోల సంఘం అసహనాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు తహసీల్దార్ గెడ్డం ఎలీషాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ రేషనలైజేషన్ ప్రక్రియలో ఇచ్చిన జీవోఎంఎస్ నెంబర్ 4 వలన వీఆర్వోలకు విపరీతమైన పనిభారం, పని ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

నేడు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సమ్మె

ఏలూరు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ప్రస్తుతం పని చేస్తున్న 14 మంది డ్రైవర్స్ (పైలెట్లు) మంగళవారం తమ విధులను బహిష్కరించి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులో లేక చివరకు ప్రైవేటు వాహనాలపైనే బాలింతలు తమ పసి కందులను తీసుకుని వెళుతున్నారు. ఇదే అదనుగా తీసుకున్న ప్రైవేటు అంబులెన్సులు, వాహనదారులు అదనపు సొమ్ములను గుంజుకుంటున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి తప్పుడు నివేదికలను అందిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేడు సమగ్రశిక్ష పోస్టుల దరఖాస్తుదారులకు పరీక్ష

ఏలూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష జిల్లాప్రాజెక్టు ఏపీసీ కార్యాలయంలో ఖాళీగావున్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తుచేసుకున్న ఇన్‌సర్వీస్ టీచర్లకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో కంప్యూటర్ బేసిక్ స్కిల్స్‌పై పరీక్ష నిర్వహించనున్నారు. ఏఎస్‌వో(2 పోస్టులు), ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్, సీఎంవో పోస్టులకు మొత్తం 36మంది దరఖాస్తుచేసుకోగా, ఉర్దూ ఏఎంవో పోస్టుకు ఒక్కరూ దరఖాస్తుచేసుకోలేదు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం


జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ఉంగుటూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నారాయణపురంలో నూతనంగా నిర్మించిన క్యాంప్, పార్టీ కార్యాలయాన్ని సోమవారం నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, బొమ్మిడి నాయకర్, పులవర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, జనసేన పార్టీ కార్యదర్శులు చెనమళ్ల చంద్రశేఖర్, ఆర్టీసీ రీజినల్ చేర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డి.సి.ఎం.ఎస్.చైర్మెన్ చాగంటి మురళీ కృష్ణశరణాల మాలతీరాణి పాల్గొన్నారు. భీమడోలు మండలానికి చెందిన సర్పంచ్ బలే రాంబాబు, పోలసానపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం, అక్కుపల్లిగోకవరం వైసీసీ నాయకులు పార్టీలో చేరగా వీరందరికి ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

జీపీఎఫ్ కల్పించాలని వినతి

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలో 1999-2004 మధ్య ఉద్యోగం పొందిన వారికి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని విద్యుత్ జీపీఎఫ్ సాధన సమితి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సాధన సమితి నాయకులు పి శ్రీనివాస్, కె కృష్ణకుమార్, వై శ్రీనివాస్, శారద, సంధ్యారాణి పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి కృషి


చైర్మన్ స్వామిని సత్కరిస్తున్న సంఘ నాయకులు

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టైలర్స్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా ఎన్నికైన ఆకాశపు స్వామి అన్నారు. సమాఖ్య చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా సోమవారం ఏలూరు పట్టణ టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈసంద్భంగా చైర్మన్ మట్లాడుతూ టైలరింగ్ వృత్తిపై జీవనం సాగిస్తున్న వారంతా నూతన పోకడలను అందిపుచ్చుకోవాలన్నారు. అధ్యక్షుడు ఎండి హుస్సేన్, డి నాగేశ్వరరావు, కె శ్రీను, లక్ష్మణ్, వి నాగేంద్ర, పి వెంకట్, సత్యనారాయణ, పవన్ పాల్గొన్నారు.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలి

ద్వారకాతిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చే వరకు కోకో రైతుల పోరాటం ఆగదని ఏపీ కోకో రైతుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఎం నాగులపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో కోకో రైతులు ధర్నా చేశారు. అనంతరం ప్రాంతీయ సదస్సు జరిగింది. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించి ఈ సదస్సులో కోకో రైతుల సమస్యలను చర్చించారు. పలు తీర్మానలు చేసి వాటిని ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గడచిన మూడు నెలల కాలంలో కోకోరైతులు వెయ్యికోట్ల రూపాయలు వరకు నష్టపోయారన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

లింగపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఆయనను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రప్రభుత్వం పేదలకు ఉచితంగా భూపంపిణీ అమలు చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో తువ్వచిలుక రాయుడుపాలెం గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా దుబ్బాకు దాసు ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.

టి.నర్సాపురం: మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ సుందరయ్య ఆదర్శ మూర్తి అన్నారు. మండల కమిటీ సభ్యులు అలుమోలు మురళీ, మడకం కుమారి, శిరీష పాల్గొన్నారు.

రేపు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పెదవేగి, మే 19(ఆంధ్రజ్యోతి) : దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) పాలకవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 9గంటలకు ఏఎంసీ ఆవరణలో నిర్వహించే పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి భారీగా జనం తరలివచ్చే అవకాశం ఉన్నందున దీనికి తగ్గట్టుగానే ఏర్పాట్లుకూడా భారీగా చేస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు మోటివేషన్ తరగతులు

ఏలూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రెండోవిడత వార్షిక శిక్షణశిబిరంలో బాగంగా ఉమ్మడిజిల్లా ఎన్‌సీసీ కెడెట్లకు సోమవారం ప్రేమాలయం వృద్ధమాతల ఆశ్రమం గురాజీ వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక విన్సెంట్ డీపాల్ కళాశాల ప్రాంగణంలో మోటివేషన్, మెడిటేషన్ తరగతులు నిర్వహించారు.

తప్పిన పెను ప్రమాదం

గుడిసెలపై కూలిన చెట్టు



పోలవరం, మే 19(ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలులకు ఆదివారం పోలవరం ప్రాజెక్టుకి వెళ్ళే రోడ్డు మార్గంలో ఏటిగట్టుకి ఎడమవైపున ఉన్న యానాదుల పూరి గుడిసెలపై భారీ చింతచెట్టు కూలిపడడంతో రెండు గుడిసెలు ధ్వంసమయ్యాయి. చెట్టు కూలిన సందర్భంలో ఆ ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఉన్న గుడిసెలు నేలమట్టం కావడంతో బాధితులు రోడ్డున పడ్డారు. గత ఏడాది మే నెలలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇవే గుడిసెలు దగ్ధమై కట్టుబట్టలతో సహా బాధితులు రోడ్డున పడ్డారు. మళ్లీ ఈ ఏడాది చెట్టు కూలి నష్టం జరిగింది. అధికారులు స్పందించి తమకు పక్కా గృహాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు పసుపులేటి కొండయ్య, గుబ్బాలమ్మ, గొలిసే అప్పలస్వామి రాజమ్మ కోరారు.

వెహికల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఏలూరు టూటౌన్, మే19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కార్మికుల యూనియన్ నాయకులు జీ.సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం సునీల్ మాట్లాడుతూ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పని చేసే ఇతర డ్రైవర్లను వేధిస్తున్నాడని అన్నారు. ప్రతి చిన్నపనికి కూడా లంచాలు తీసుకుంటూ కింది సిబ్బందిని వేధిస్తున్నారని అన్నారు. అతని పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటు విద్యుత్‌శాఖ ఏఈ కె.ఎం అంబేద్కర్ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు.జ

భీమడోలు: భీమడోలు 33/11కేవీ పూళ్ళ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పూళ్ళ ఎంఎంపురం ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

దళారుల మాటలు నమ్మొద్దు

ఏలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన లభించింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు సంబంధించి సోమవారం 'రుణం మాకే అందించండి' కథనం ప్రచురితమైంది. దీనిపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి స్పందించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మంత్రి పార్థసారథి సైతం ఆరా తీశారు. రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆశాఖ ఈడీ ముక్కంటి పేర్కొన్నారు. దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దళారులు చెప్పే మోసపూరిత మాటలు నమ్మొద్దని ముక్కంటి హెచ్చరించారు.

జీసీసీ బ్రాంచి మేనేజర్‌గా రాజయోగి



బుట్టాయగూడెం, మే 19(ఆంధ్రజ్యోతి): కెఆర్‌పురం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచి మేనేజర్‌గా చెరుకూరి రాజయోగి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే జీసీసీలో ఆయన ఇటీవలే సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ఇంతకాలం ఇన్‌చార్జిగా పనిచేసిన రాజయోగి జీసీసీ ఎండీ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలి

ఏలూరుటూటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలని అరుంధతీయ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జేఏసీ జోనల్ చైర్మన్ జె.వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్‌కు సంబంధించిన గెజిట్‌లో పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలు చేయాలని ఉందన్నారు. కానీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ నెంబర్ 46ని పదోన్నతి విషయాన్ని మరచిపోయారని అన్నారు. దీంతో ఎంతో మంది ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

22న హనుమాన్ శోభాయాత్ర

ముదినేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ముదినేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ముదినేపల్లి మండలంలో హనుమాన్ శోభాయాత్ర జరగనుంది. భక్తి పూర్వక బైక్ ర్యాలీ పేరుతో నిర్వహించనున్న ఈ శోభాయాత్ర ముదినేపల్లి భక్తాంజనేయ స్వామి దేవస్థానం నుంచి సింగరాయపాలెం బావాజీ మఠంలోని శ్రీ కోదండ రామాలయం వరకు జరుగుతుందని, హిందూ సోదరులు, హనుమాన్ భక్తులు పాల్గొని ఈ శోభాయాత్రను విజయవంతం చేయాలని వాసవీ సేవా దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వత్సుమిల్లి ప్రసాద్ కోరారు.

నేడు కైకలూరులో తిరంగా ర్యాలీ

కైకలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో భారత్ విజయం సాధించడం పట్ల మంగళవారం కైకలూరులో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 5గంటలకు ట్రావెలర్స్‌బంగ్లా నుంచి మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొని దేశభక్తిని చాటుకోవాలన్నారు.

21 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

ముదినేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని మారుతీ నగర్‌లో సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 25 వరకు జరుగుతాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 21న స్వామిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా చేయటం, 22న ఉదయం పంచామృత అభిషేకాలు, రాత్రి స్వామి దివ్య కల్యాణ మహోత్సవం, 23న హోమ కార్యక్రమాలు, రథోత్సవం, 24న సీతారామచంద్రస్వామి (పెదరామాలయం) ఆలయంలో చక్రస్నానం, 25న అన్నసమారాధన జరుగుతాయని ముదినేపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, వాసవీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వత్సుమిల్లి ప్రసాద్ తెలిపారు.



ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావుకు కరపత్రాలను అందజేసిన కమిటీ సభ్యులు

హనుమాన్ శోభాయాత్రపై కరపత్రాల పంపిణీ

కలిదిండి, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి పురస్కరించుకుని ఈనెల 22న కోరుకొల్లు బస్టాండ్ సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి గుర్వాయిపాలెం అభయాంజనేయ స్వామి ఆలయం వరకు నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు కరపత్రాలను పంపిణీ చేశారు. కోరుకొల్లులో ఎంపీపీ ఉమామహేశ్వరరావుకు కరపత్రాలు అందజేశారు. హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు అగ్ని హోత్రం ఆత్రేయబాబు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు, కోకా రమేష్, పంచగర్ల శివాజీ, పేరం ప్రసాద్, కాశీ విశ్వనాథ్, పాండు రంగారావు పాల్గొన్నారు.

పంచాయతీ ఆర్థిక లావాదేవీలు కోరుతూ అర్జీ



ముదినేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలు చెప్పాలని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో అశోక్‌కు సోమవారం సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు కో రుతూ అర్జీ అందజేశారు. 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పంచాయతీ ఆదాయ వ్యయాలు, గ్రామంలో హెల్త్ సెంటర్, మిల్క్ సెంటర్, రైతు భరోసా కేంద్ర భవనం నిర్మాణాలకు మంజూరైన నిధుల వివరాలు కూడ ఇవ్వాలని నాగరాజు కోరారు.

కైకలూరు వైస్ ఎంపీపీ-2 టీడీపీ కైవసం



వైస్ ఎంపీపీ-2గా ఎన్నికైన గంగుల వెంకటనరసమ్మను, ఎంపీటీసీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైస్ ఎంపీపీ-2 ఉప ఎన్నికలో టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు గంగుల వెంకట నరసమ్మ ఎన్నికయ్యారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైస్ ఎంపీపీ ఉప ఎన్నికకు ఆర్డీవో ఆచ్యుత్ అంబరీష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ప్రత్యేక అబ్జర్వర్‌గా జేసీ ధాత్రిరెడ్డి పర్యవేక్షించారు. మార్చి 26న అప్పటి వైస్ ఎంపీపీగా ఉన్న ఎండీ జహీర్ రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నికను నిర్వహించారు. కూటమికి చెందిన ఎంపీటీసీలు 10 మంది హాజరుకాగా వారిలో తామరకొల్లు ఎంపీటీసీ గంగుల వెంకట నరసమ్మను ప్రతిపాదించి ఎన్నుకున్నారు. వైసీపీకి చెందిన 8 మంది ఎంపీటీసీలు హాజరైనా సంఖ్యాబలం చాలకపోవడంతో సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. కైకలూరు వైస్ ఎంపీపీ-2 అభ్యర్థిగా గంగుల వెంకటనరసమ్మను గెలిపించడం పట్ల కూటమి నేతలను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అభినందించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు కూటమి నేతలు ర్యాలీగా తరలి వెళ్లారు. బాణసంచా కాలుస్తూ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు బీకేఎం నాని, పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రావు, కొల్లి బాబి, చెరుకువాడ బలరామరాజు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష మల్లెల పూజ



కైకలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కైకలూరులో వేంకటేశ్వరస్వామికి లక్ష మల్లెల పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో కైకలూరు వికాసతరంగిణి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో లక్ష మల్లెల పూజలు జరిపారు. వైశాఖ శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామికి మల్లెపూలతో పూజలు చేశారు. వందలాది మంది మహిళలు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈవో వీఎస్‌కే శేఖర్ ఏర్పాట్లును పర్యవేక్షించారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చిరస్మరణీయుడు పుచ్చలపల్లి సుందరయ్య

కలిదిండి, మే 19 (ఆంధ్రజ్యోతి): కార్మికుల అభ్యున్నతికి కృషి చేసిన పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీయుడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. సోమవారం పోతుమర్రు, భాస్కరావు ఎట, మూల్లంక గ్రామాల్లో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పుస్తక పఠనంతో విద్యావికాసం

కలిదిండి, మే 19 (ఆంధ్ర జ్యోతి): పుస్తక పఠనంతో విద్యావికాసం, క్రమశిక్షణ పెం పొందుతుందని గ్రంథా లయాధికారి రాఘవులు అన్నారు. సోమవారం కోరుకొల్లులో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథా యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నేర్పిం చారు. గ్రంథాలయాల్లో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను చదవటం విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు.

రమేష్ మృతి పార్టీకి తీరని లోటు

ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే కామినేని



రమేష్‌బాబు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు తేరా రమేష్‌బాబు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. వేమవరప్పాడులో ఇటీవల మృతి చెందిన కైకలూరు టీడీపీ కో కన్వీనర్, టెలికం బోర్డు సభ్యుడు తేరా రమేష్‌బాబు నివాసానికి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కలసి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీ మాట్లాడుతూ పార్టీకి ఆది నుంచి కష్టపడి రమేష్ సేవలందించారని అలాంటి నాయకుడు మృతి చెందడం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకుని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి నేతలు బీకెం నాని, తాడినాడ బాబు, బలే ఏసురాజు, నల్లగోపుల చలపతి, నున్న కొండా, బోయిన గోవర్ధన, బొడావుల జగదీష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈ దారిలో హాయిలే..!



ముదినేపల్లి - భీమవరం (వయా సింగరాయపాలెం) ప్రధాన రహదారిలో పలు చోట్ల చెట్లు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నాయి. ముదినేపల్లి - వడాలి మధ్య సుమారు కిలోమీటరు దూరం రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు, సింగరాయపాలెం నుంచి బొమ్మినంపాడు శివారు వరకు సుమారు 9 కిలోమీటర్ల పలుచోట్ల ఎండ తెలియని విధంగా అల్లుకుపోయిన చెట్లు ప్రయాణికులకు సేదతీర్చుతున్నాయి.
- ముదినేపల్లి (ఆంధ్రజ్యోతి)

శిలాఫలకంపై కాగితాలు అంటింపు



బొమ్మినంపాడు సచివాలయ కార్యాలయ భవనంపై జగన్ బొమ్మ శిలాఫలకంపై అంటించిన కాగితాలు

ముదినేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామ సచివాలయ కార్యాలయ భవనంపై నవ రత్నాల పేరుతో ఉన్న వైఎస్ జగన్ శిలాఫలకంపై పంచాయతీ సిబ్బంది ఎట్టకేలకు కాగితాలు అంటించి మమ అనిపించారు. ఈ నెల 16న సచివాలయ భవనం పై జగన్ బొమ్మ అనే శీర్షికతో పత్రికల్లో కథనాలు రావడంతో పంచాయతీ సిబ్బంది సోమవారం జగన్ బొమ్మ కనిపించకుండా శిలాఫలకంపై కాగితాలు అంటించి మమ అని పించారు. శిలాఫలకం తొలగించడం ఇబ్బందిగా ఉందని, అందుకే కాగితాలు అంటించామని సిబ్బంది చెబుతున్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ప్రారంభం

(ఐదో పేజీ తరువాయి)

సోమవారం జిల్లా కేంద్రంలోని మూడు కేంద్రాల్లో ప్రారంభమైంది. తొలి రెండురోజులు వ్యవసాయ, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. ఏలూరు లోని సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రంలో ఉదయం షిఫ్టులో జరిగిన పరీక్షకు 161 మంది విద్యార్థులకు 152 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 157 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఉదయం 191 మందికి 180, మధ్యాహ్నం 190 మందికి 184 మంది హాజరయ్యారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి ఉదయం 150 మందికి 140, మధ్యాహ్నం 137 మంది హాజరయ్యారు. మొత్తంమీద ఉదయం షిఫ్టు పరీక్షకు 30 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 23 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

టెన్త్, దూరవిద్య ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

పదో తరగతి, దూరవిద్య ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమ య్యాయి. టెన్త్ తెలుగు పరీక్షకు జిల్లాలో 1,615 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 779 మంది హాజరయ్యారు. సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ ఇంగ్లీషు పరీక్షకు 81 మంది దరఖాస్తు చేసుకోగా 61 మంది హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

తాగునీటి ట్యాంకర్లు ప్రారంభించిన మంత్రి సారథి



ట్యాంకర్లు ప్రారంభిస్తున్న మంతి కొలుసు పార్థసారథి

చాట్రాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి గ్రామ పంచాయతీకి దాతలు అందించిన రెండు తాగునీటి ట్యాంకర్లను ఆదివారం రాత్రి గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి తన తండ్రి రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఒక ట్యాంకర్, కృష్ణామిల్క్ యూనియన్ మరో తాగునీటి ట్యాంకర్ తయారు చేయించారు.

భూ సమస్యలు నెలలోపు పరిష్కరించాలి

నూజివీడు, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు, సూచనల ప్రకారం రైతుల భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంత్రి గత వారంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వచ్చిన రెవెన్యూ సమస్యలపై ఆదివారం రాత్రి చాట్రాయి మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం పట్ల మంత్రి మండిపడ్డారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన భూ సమస్యలు ఎన్ని? వాటి ప్రగతి, వాటి పరిష్కారమార్గం ఏమిటని మంత్రి, అధికారులను ప్రశ్నించగా వారు పొంతనలేని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉంటే దారి సమానంగా ఉండాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న రైతుకు దారి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. భూములు సబ్ డివిజన్ మీ ఇష్టంవచ్చినట్లు చేస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. అటవీ, రెవిన్యూశాఖలు కలిసి జాయింట్ సర్వేచేసి రైతుల సమస్యలను పరిష్క రించాలని కోరారు. సర్వేనెంబర్ 294లో గల భూసమస్యను 15 రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి చెప్పారు.

పోలీస్ విధులను అడ్డుకున్న నిందితుడికి రిమాండ్

చాట్రాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామంలో పోలీస్‌పై దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన చాపలమడుగు శివకృష్ణను సోమవారం తిరువూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఎస్సై డి.రామకృష్ణ తెలిపారు. 18వ తేదీ ఆదివారం పోలవరంలో గొడవ జరుగుతున్నదని పోలీస్టేషన్‌కు సమాచారం రావటంతో అక్కడకు వెళ్లిన పోలీస్ కానిస్టేబుల్‌పై చాపలమడుగు శివకృష్ణ దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ కేసులో పరారైన నిందితుడి అరెస్ట్

చాట్రాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలకు పాల్పడి నేర స్థలం నుంచి పారిపోయిన మండలంలోని పోతనపల్లి చిన్న తండాకు చెందిన మాలవత్తు శ్రీనివాస్‌ను సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. తిరువూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మినా, నల్ల బెల్లం విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వామ్మో.. భారీ వాహనాలు!

- సింగిల్ రోడ్డులో అతి వేగం
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో..?
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు
- ద్విచక్ర వాహనదారుల హడల్
- ఆందోళన చెందుతున్న ప్రజలు



చాట్రాయి మీదుగా వెళుతున్న భారీ వాహనం

చాట్రాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): సింగిల్ రోడ్డులో 40, 50 టన్నుల బరువుతో భారీ వాహనాలు మందలుగా అతి వేగంగా దూసుకుపోతుండటంతో జనం భయాందోళనలు చెందుతున్నారు. ఈ భారీ వాహనాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు వణికిపోతున్నారు. అసలు ఇరుకు రోడ్డులో భారీ వాహనాలను అధికారులు ఎలా అనుమతిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జంగారెడ్డిగూడెం ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు, ఇబ్రహింపట్నం క్వారీల నుంచి చాట్రాయి, పోలవరం, వెలగలపల్లి మీదుగా నిత్యం భారీగా కంకర తరలిస్తున్నారు. సింగిల్ రోడ్డు కావడం, పైగా రోడ్డు మార్జిన్లు కోతకు గురికావడం వల్ల ఈరోడ్డుపై ద్విచక్రవాహనాలు, చిన్నకార్లు నడపటం అత్యంత ప్రమాదకరంగా ఉంటున్నది. ద్విచక్ర వాహన చోదకులు కంగారు పడి రోడ్డు మార్జిన్‌లో పడి గాయాల పాలవుతున్నారు. రోడ్డు మార్జిన్లు లోతుగా ఉండటంతో తప్పుకోటానికి రోడ్డు దిగితే కట్టలు విరుగుతున్నాయని చిన్న కార్లు యజమానులు, చోదకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భారీ వాహనాల అధికలోడు, అతి వేగానికి కళ్లెం వెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వాహనాలను ఎలా అనుమతిస్తారు?



సింగిల్ రోడ్డులో ఈ భారీ వాహనాలను అధికారులు ఎలా అనుమతిస్తున్నారో తెలియడం లేదు. ఈ వాహనాలు అతివేగంగా నడుపుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఎదురుగా భారీ వాహనాలు వస్తున్నాయంటే జనం హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భారీ వాహనాలను నియంత్రించాలి
- శీర్ణం వేణుగోపాలరెడ్డి, చాట్రాయి

చిన్నంపేటలో సహకార పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్న అధికారులు

చాట్రాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నిర్మించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకును సోమవారం నూజివీడు కో-ఆపరేటివ్ డీఆర్ ఎం.రవికుమార్, ఏలూరు సేల్స్ ఆఫీసర్ మహేష్‌కుమార్ ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంకు లీగల్ అడ్వైజర్ అత్తులూరి శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈవో రవికుమార్, నాయకులు బొంతు సత్యనారాయణ, పరసా వెంకటేశ్వరరావు, అత్తులూరి చక్రధరరావు రైతులు పాల్గొన్నారు.

50వ రోజు మజ్జిగ పంపిణీ

నూజివీడు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నూజివీడు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 50 రోజులుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పెద గాంధీబొమ్మ సెంటర్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 50 రోజులకు చేరిన సందర్భంగా వాసవీక్లబ్ కార్యవర్గానికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. వాసవీక్లబ్ జిల్లా ఇన్‌చార్జి చిన్నం శ్రీనివాసరావు, పేర్ల వెంకటేశ్వరరావు, మానేపల్లి సతీష్, తటవర్తి కుమార్, సుష్మ, గోళ్ళ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



కుంచనపల్లి వద్ద పల్టీ కొట్టిన కారు

జాతీయ రహదారిపై పల్టీ కొట్టిన కారు

తాడేపల్లిగూడెం రూరల్, మే19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న కారు కుంచనపల్లి వద్ద పల్టీలు కొట్టుకుంటూ బోల్తా పడింది. సోమవారం విజ యవాడ నుంచి తణుకు వైపు వెళుతున్న మహిళ నిద్ర మత్తులో కారు అదుపు చేయలేకపోయింది. స్వల్పగాయాలతో ఆమె బయటపడ్డారు.




సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ఆగిరిపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సోమవారం సుందరయ్య భవన్‌లో ఏలూరు జిల్లా కార్యదర్శి జి.ఎస్.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడి సమస్యలను పరిష్కరించిన మహోన్నత వ్యక్తి అని తెలి పారు. సీపీఎం శ్రేణులు, సీఐటీయూ ప్రజా సంఘాలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు ముత్యాల నరేష్, సత్తు కోటేశ్వరరావు, ఉలక్కయ్య, ఎస్.కెభాషా, కిరణ్‌కుమార్, కోటయ్య, సాదం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475